@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

సోమవారం
23 నవంబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :136
పేజీలు : 12 వెల : 5/-

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE





50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు

- ప్రపంచ బ్యాంకు నివేదికతో దేశానికి గర్వకారణం
- బీజేపీ పాలనలోనే ఈ ఘనత సాధించామన్న మోదీ
- పేదల సంక్షేమానికి పథకాలే కీలకం
- బ్యాంకు ఖాతాలు, గ్యాస్, విద్యుత్‌తో ప్రయోజనాలు
- సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించాం
- రాబోయే తరాలు స్వర్ణయుగాన్ని చూస్తాయి



గోదావరి పుష్కరాల లోగో

రూపకల్పనకు రూ.లక్ష బహుమతి

- 8 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా..
- 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు పుష్కరాలు..
- 67 ప్రాంతాల్లో ఏర్పాట్లు
- లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పనకు పోటీలు
- తొలి బహుమతి రూ.లక్ష.. రెండో బహుమతి రూ.50 వేలు
- టాప్ 100 మందికి ప్రశంసా పత్రాలు
- పుష్కరాలకు 8 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం
- భక్తుల కోసం 67 ప్రాంతాల గుర్తింపు
- మూడు కేటగిరీలుగా పుష్కర ఘాట్ల విభజన
- మౌలిక వసతుల పనులకు ప్రత్యేక కార్యాచరణ
- ఘాట్ల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల కేటాయింపు

ఏపీ ప్రాజెక్టులకు బీఆర్ఎస్ ముద్ర!

- ఏపీ ప్రాజెక్టులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభం!
- కాంగ్రెస్ వచ్చాక కొత్త ప్రాజెక్టులేవీ లేవు..
- 299 టీఎంసీల కేటాయింపుపై కేసీఆర్ సంతకమే కారణం
- కరువు నివారణకు రూ.30 వేల కోట్ల సాయం కోరాం
- ఎస్ఐఆర్‌పై బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- 'ఇందిరమ్మ సూక్తులు' పుస్తకావిష్కరణ



హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఇటీవల చర్చనీయాంశంగా మారిన పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు సైతం 2022లోనే ప్రారంభమైందని, అప్పుడే జలజీవన్ మిషన్ కింద కేంద్రం రూ.1,580 కోట్ల రుణం మంజూరు చేసిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 299 టీఎంసీల కేటాయింపుపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సంతకమే కారణమని రేవంత్ విమర్శించారు. ఆ కేటాయింపుల ఆధారంగానే ఏపీలో ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందన్నారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆ ప్రాజెక్టులు ప్రారంభమైనట్లుగా - మిగతా 11 లో



ప్రేమకు అడ్డుగా ద్వేష భావజాలం!

- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ధ్వజం
- భారతీయ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు అవగాహన లేదు

భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక చర్చలేవీ జరగలేదు

- ఎస్సీవో వేదికపై కేంద్రం స్పష్టత.. సాధారణ సంభాషణలే జరిగాయని వెల్లడి
- ద్వైపాక్షిక చర్చలపై కేంద్రం స్పష్టత.. పాక్ మంత్రితో సాధారణ సంభాషణలే
- ఇంద్రప్రస్థ కమ్యూనిక్ విడుదల.. వారసత్వ పరిరక్షణకు ఏఐ వినియోగం
- యునెస్కో గుర్తింపునకు ఉమ్మడి నామినేషన్లు.. నాలుగు కీలక అంశాలపై చర్చలు
- ప్రపంచ శాంతికి సంస్కృతి వారధి.. వసుధైవ కుటుంబకానికి ఎస్సీవో మద్దతు..





అగ్నివీరులకు పెళ్లికి

గ్రీన్‌సిగ్నల్

- రెండేళ్ల సర్వీసు పొడిగింపు ఎంచుకునేవారికి అవకాశం..
- నాలుగు వారాల శిక్షణ తర్వాతే అనుమతి
- 75 శాతం మందికి మరో రెండేళ్ల అవకాశం
- నిబంధనల సడలింపుతో ఊరట

కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే రాజకీయాల నుంచి

తప్పుకుంటా!

- 500 రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- 420 హామీలిచ్చి ఒక్కటీ సరిగా అమలు చేయలేదు
- మహిళలను కోటీశ్వరులను చేస్తామన్నారు.. లక్షాధికారులనైనా చేయాలి
- వరంగల్ అభివృద్ధిపై ప్రభుత్వానికి ప్రశ్నలు
- సంక్షేమం సున్నా.. అభివృద్ధి గుండుసున్నా
- సొంత పార్టీ నేతలే అవినీతి ఆరోపణలు చేస్తున్నారు



హనుమకొండ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి చూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ - మిగతా 11 లో

వచ్చే ఎన్నికల్లో కోటి ఓట్లు.. 90 సీట్లు గెలుస్తాం

- పైరవీలతో పదవులు రావు.. పార్టీ కోసం కష్టపడిన వారికే గుర్తింపు
- గ్రామాలు, గూడేలు, తండాల్లో ప్రజలతో మమేకం కావాలి
- రెండోసారి అధికారంలోకి రావడమే లక్ష్యం
- పైరవీలతో పదవులు రావు
- 90 రోజుల్లో 48 లక్షల సభ్యత్వాలు
- పార్టీ కోసం పనిచేసిన వారికే అవకాశాలు
- నాయకుల పనితీరుపై ప్రత్యేక నిఘా
- నిరాశలో ఉన్న నేతలకు గుర్తింపు
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో నిజాయతీగా పనిచేసిన వారిని వెతుక్కుంటూ పదవులు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో అగ్రనేతల చుట్టూ, గాంధీభవన్ వద్ద తిరిగితే పదవులు రావని స్పష్టం చేశారు. నాయకులు గ్రామాలు, గూడేలు, తండాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి తగిన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోటి ఓట్లతో కాంగ్రెస్ 90 స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడిగా తాను బాధ్యతలు చేపట్టిన సమయంలో కాంగ్రెస్ - మిగతా 11 లో



చైనా సరిహద్దు గ్రామాల్లో

పెరిగిన జనాభా

- 40 గ్రామాలకు తిరిగొచ్చిన ప్రజలు.. వలసలకు అడ్డుకట్ట: అమిత్ షా
- అభివృద్ధి సరిహద్దుల నుంచే ప్రారంభం కావాలి
- అరుణాచల్‌కు కేంద్ర నిధులు భారీగా పెంపు

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

- నవంబర్ 27 తర్వాత బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశం
- అల్పపీడనంగా బలపడే సూచనలు
- ఏపీకి ప్రస్తుతానికి తుపాను ముప్పు లేదన్న నిపుణులు
- శ్రీలంక లేదా తమిళనాడు వైపు వెళ్లే అవకాశాలే ఎక్కువ
- తూర్పు గాలులతో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు



సంపాదకీయం

ఆరని బంగ్లా మంటలు!

బంగ్లాదేశ్‌లో డిసెంబర్‌లో అడుగుపెడతానంటూ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించాక నాలుగు నెలల క్రితం ఆ దేశంలో మొదలైన హింస ఇంకా చల్లారలేదు. ఆమెసొంతపార్టీ అవామీ లీగ్ కార్యకర్తలు గత వారమంతా నిరసనలూ, ర్యాలీలూ జరిపి, ముగింపుగా గురువారం నిర్వహించిన బంద్ గమనిస్తే ఆ దేశం ఇప్పట్లో కుదుటపడుతుందన్న విశ్వాసం కలగదు. పరస్పర హననమే పరమావధిగా పార్టీలు రెచ్చిపోతున్నాయి. తాజాగా పారా మిలిటరీ బలగాల కాల్పుల్లో నలుగురు మరణించటం, అనేకులు గాయపడటం, ప్రభుత్వ ఆస్తులకు నిప్పెట్టడం వంటి పరిణామాలు దిగ్భ్రాంతి కలిగి స్తున్నాయి. ముందురోజే అధికార బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) కార్యకర్తల్ని హత్యచేశారు. ఇద్దరు ఎంపీల ఇళ్లు తగలపెట్టడంతోపాటు, దాదాపు రెండేళ్లు కొనసాగిన తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా పనిచేసిన మహ్మద్ యూనస్ పూర్వీకుల ఇంటికి నిప్పంటించారు. ఈ దుఃస్థితికి మహ్మద్ యూనస్‌తోపాటు ప్రస్తుత ప్రధాని తారిఖ్ రెహ్మాన్ కూడా బాధ్యులే. హసీనా ఏలుబడిలో కక్షసాధింపు చర్యలు మితిమీరిన మాట వాస్తవం. ఎన్నికల్లో రిగ్గింగ్‌తో అధికారంలో కొనసాగింది కూడా నిజం. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదంటూ ఆమె ప్రభుత్వం వేసిన దండోరా... జనం అనుభవి స్తున్న కడగండ్లను రూపుమాపలేకపోయింది. దేశంలో ఉపాధి కరువై, ధరలు బరువై సామాన్యులు కుంగిపోతుంటే అందుకు తగిన పరిష్కారాల్ని వెదకడంలో హసీనా విఫల మయ్యారు. దానికి నిరసనగానే 2024లో విద్యార్థి ఉద్యమం ఉధృతమై చివరకు ఆమె దేశం విడిచిపెట్టాల్సి వచ్చింది. ఈ ఉద్యమంలోని ప్రజాస్వామిక ఆకాంక్షల్ని అర్థం చేసుకోకుండా, 'ఈసారిమావంతు...' అన్నట్టు తాత్కాలిక ప్రభుత్వం వ్యవహరించింది. ప్రస్తుత ప్రభుత్వమూ అదే మార్గంలో పోతున్నది. ఉద్యమం తొలినాళ్లలోనే మతోన్మాద శక్తులు చొరబడి తమ ప్రాబల్యం స్థాపించేందుకు ప్రయత్నించాయి. మళ్లీ మధ్యయుగాలనాటి పరిస్థితుల్ని తలపించేలా మైనారిటీ హిందూ వర్గాలపై దాడులు చేశాయి. హత్యలకూ, గృహదహ నాలకూ పాల్పడ్డాయి. బురఖా వేసుకోనందుకు ఎందరో మహిళల్ని నడిబజార్లలో నెత్తురోడేలా కొట్టారు. అదృష్టవశాత్తూ అలాంటి శక్తుల్ని జనం ఓడించారు. బీఎన్‌పీ అధికారంలోకొచ్చింది. కానీ మారిందేమీ లేదు. స్వావలంబన సాధించి, దేశాన్ని ప్రగతిపథంలో పయనింపజేయాలని ప్రయత్నిస్తుంటే... అవామీ ఉగ్ర పోకడలకు పోతున్నదని తారిక్ రెహ్మాన్ అంటున్నారు. ఇలాంటి అతిశయోక్తులే హసీనా కొంపముంచాయి. అవామీ నిరసనలకు సమాంతరంగా దేశంలో దుస్తుల తయారీ కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులు వేతనాల పెంపుదల కోసం రోడ్డెక్కారు. చివరకు గురువారం ఢాకా హైవేను స్తంభింపజేశారు. ఈ ఉదంతం చాలు... రెహ్మాన్ పాలన ఎంత దివ్యంగా ఉన్నదో చెప్పడానికి. విదేశాల్లో ఉండి హింసను రెచ్చగొడుతున్నారంటూ పరోక్షంగా హసీనాను అని ప్రయోజనం లేదు. తన నిర్వాకాన్ని సమీక్షించుకోవాలి. కేవలం తొమ్మిది నెలల పాలన ఆధారంగా తారిఖ్‌ను అంచనా వేయటం అన్యాయమే కావొచ్చు. అధికారంతోపాటు వచ్చే దర్పాన్నీ, సదుపాయాలనూ ఆయన తిరస్కరించారు. తన బొమ్మ ప్రభుత్వాఫీసుల్లో ఉండరాదన్న నియమం పెట్టారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించారు. అల్పాదాయ వర్గాల కుటుంబాల్ని ఆదుకునే ఫ్యామిలీ కార్డు తీసుకొచ్చారు. రైతులకు పదివేల టాకాల వరకూ రుణమాఫీ ప్రకటించారు. ఇలాంటివే హసీనా సర్కారు కూడా చేసింది. తారిఖ్ వీటితోపాటు ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే చర్యలు మొదలెడితే వేరుగా ఉండేది. కానీ కక్షసాధింపే ప్రభుత్వ కార్యక్రమంగా మారింది. అంతకుముందే హసీనాకు మరణశిక్ష విధించగా, మరో కేసులో 21యేళ్ల జైలుశిక్ష, వాటితోపాటు అవామీ నేతలు, కార్యకర్తలపై దాడులు, అరెస్టులు రివాజ య్యాయి. నిత్యావసరాల ధరలు, నిరుద్యోగిత, విద్యుత్ వెతలు, వ్యవస్థల్ని చక్కదిద్దక పోవటం, పెట్టుబడులకు అనువైన వాతావరణం లేకపోవటం ప్రజలకు నిరాశమిగిల్చింది. తొమ్మిది నెలల విలువైన సమయాన్ని వృథా చేసిన ప్రభుత్వంపై అసంతృప్తి పెరగటంలో వింతేముంది? వచ్చే నెలలో నిజంగా హసీనా అడుగుపెడితే సమస్యలు మరిన్ని చుట్టుముడతాయి. సారాంశంలో ఇదంతా తారిఖ్ స్వయంకృతం.

ఇండియాకు దారి చూపిన ఓట్ చోరీ



ఓట్ చోరీకి వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలతో సర్ ప్రక్రియ పట్ల సుప్రీంకోర్టు దృక్పథం మారింది. 13.30 కోట్ల మంది పౌరులు ఓటుహక్కు కోల్పోయేందుకు కారణమైన ఆ సవరణ ప్రక్రియలోని విధి విధానాలు కొన్నిటిని రద్దు చేసేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సైతం నిర్ణయించి, దిద్దుబాటు చర్యలూ చేపట్టింది. నియమం ప్రకారం అయితే ఓటర్ల సంఖ్య వయోజన జనాభాకు ఇంచుమించు సరిసమానంగా ఉండి తీరాలి. మరి సర్ ప్రక్రియ అమలుపూర్తయిన అనంతరం ప్రతి రాష్ట్రంలోను వయోజన జనాభా --ఓటర్ల నిష్పత్తి ఎలా ఉండనున్నది? ఆ నిష్పత్తి 100 శాతానికి చేరువలో ఉన్నట్టయితే తుది జాబితాలు లోపరహితమైనవని విశ్వసించవచ్చు. లేనిపక్షంలో అవి లోపభూయిష్ఠమైనవి అనేందుకు సంకోచించనవసరం లేదు.
ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైన ఓటర్లలో (మృతులు మినహా) అత్యధికుల పేర్లు మళ్లీ జాబితాలలో చేరనున్నాయి. తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి, తప్పులు జరిగి ఉంటే వాటిని సరిదిద్దుతారని, ఈసీఐ ఇచ్చిన హామీ ద్వారా సర్ తుది జాబితాలు సక్రమంగా ఉండేందుకు అవకాశమున్నదనే నమ్మకం కలుగుతోంది. మంచిదే. అయినా, సర్ రాజ్యాంగవిహితంగా అమలవుతున్నదని మొదటినుంచీ వాదించిన ఈసీఐ ఇప్పుడు ఈ చర్యలు ఎందుకు తీసుకుంటున్నట్టు? తన తప్పులకు ప్రాయశ్చితం చేసుకుంటోందా? లేక, సర్‌లో అన్యాయం కొనసాగితే ప్రజలు మరింతగా ఆగ్రహ భారర్తవులు అవుతారని భయపడిందా? ఏమైనా కావచ్చు కానీ ఒకటి మాత్రం స్పష్టం: తొలగింపులకు గురైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలలో చేర్చడం వల్ల ఓట్ చోరీ వ్యతిరేక ఉద్యమం 2029 నాటికి తన ప్రభావశీలతను పూర్తిగా కోల్పోవడం ఖాయమని భారతీయ జనతా పార్టీ విశ్వసిస్తున్నది.
2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంలో 'భారత రాజ్యాంగం ప్రమాదంలో పడింది' అన్న అంశం ప్రజలను అమితంగా కలవరపరిచింది. స్వాతంత్ర్య నిర్మాతలు, గణతంత్ర రాజ్యాంగ వ్యవస్థాపకుల ఆశయాలు, అభీష్టాలు వమ్ముయిపోతున్నాయనే భావన ప్రజల మనసుల్లో నెలకొన్నది. దీనికితోడు అవధులు లేని అవినీతి, అదుపు లేని ధరల పెరుగుదల, పెచ్చరిల్లిన నిరుద్యోగం, గ్రామీణ శ్రామిక, పట్టణ కార్మిక జనావళికి ఎదుగూ బొదుగూ లేని వేతనాలు, వ్యవసాయ ఆదాయాలు తగ్గిపోవడం, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కొరవడడం, సమాజ జీవితంలో సర్వత్రా నేరపూరిత కార్యకలాపాలు పెరిగిపోవడం మొదలైనవి అన్ని రాష్ట్రాల ప్రజలనూ వేధించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారింది. అయితే ప్రజల అసంతృప్తి, ఆగ్రహం ఆ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించలేకపోయాయి. ఎన్నికల పూర్వ, అనంతర పొత్తులతో ఎన్డీఏ సర్కార్ 293 మంది సభ్యుల మద్దతును కూడగట్టుకున్నది. ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 స్థానాలు వచ్చాయి. 'రాజ్యాంగం ప్రమాదంలో పడింది' అన్నది సత్యదూరం కాదు కనుకనే అసంఖ్యాక ప్రజలు ఆ వాస్తవాన్ని విశ్వసించారు. ఆ ఆరోపణతో ఇండియా కూటమి నిర్వహించిన ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. అయినప్పటికీ ఎన్నికలలో పరిస్థితులు ఇండియా కూటమికి అనుకూలంగా పరిణమించలేదు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ మళ్లీ అధికారంలోకి రాగలిగింది.

ఈ నవంబర్ తొలినాళ్లలో అమెరికా కాంగ్రెస్‌కు జరిగిన మధ్యంతర ఎన్నికలలో కూడా ఇటువంటి పరిణామాలే సంభవించడం గమనార్హం. రిపబ్లికన్ పార్టీ 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ప్రచారానికి డెమొక్రాట్లు దీటుగా ప్రతిస్పందించారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రాజ్యాంగ విరుద్ధ పాలనాశైలి అమెరికన్ ఓటర్లను మనస్తాపానికి గురిచేసింది. ట్రంప్ అప్రజాస్వామిక పాలనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసిన అంశాలు రెండు: ఒకటి యుద్ధం, మరొకటి ధరలు అందుబాటులో లేకుండాపోవడం. అత్యధిక ఓటర్లకు ఆహారం, ఇంధన ధరలు, గృహ వసతి వ్యయాలు భరించలేని స్థాయిలో పెరిగిపోయాయి. రోజువారీ జీవితం దుర్భరమైపోవడానికి ట్రంప్ విధానాలే కారణమని అమెరికన్లు విశ్వసించారు. గాజా (పాలస్తీనా)పై ఇజ్రాయెల్ దాడుల్లో వేలాది అమాయక ప్రజలు హతమారిపోవడం, ఆ ప్రాంతం పూర్తిగా విధ్వంసమవడం అమెరికా ఓటర్లను కలవరపరిచింది. ఇజ్రాయెల్‌తో కలిసికట్టుగా ఇరాన్‌పై ట్రంప్ యుద్ధానికి వెళ్లడంవల్లే తమకు కష్టాలు దాపురించాయని వారు గట్టిగా భావించారు. యుద్ధం కారణంగా చమురు రవాణాకు కీలకమైన హోర్మూజ్ జలసంధి మూతపడడం, అనేక దేశాలకు వ్యతిరేకంగా ట్రంప్ విచక్షణారహితంగా విధించిన సుంకాలతో స్వదేశంలో ధరలు అలవికాని విధంగా పెరిగిపోయాయని, ట్రంప్ పాలన తమకు కష్టనష్టాలనేకానీ కనీస శ్రేయస్సును ఇవ్వడం లేదని అమెరికన్లు నమ్ముతున్నారు.
భారత్‌లో కూడా అటువంటి పరిస్థితులే ఉన్నాయి. ఆహార ధరలు పెరిగిపోయాయి. టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం 12.3శాతంగా ఉండగా, వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం ఆర్బీఐ నిర్దేశించిన గరిష్ఠ పరిమితిని దాటి 6.1శాతంగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం 8.9శాతం. ఒక ప్లేటు శాకాహార భోజనం ధర ఐదు సంవత్సరాల క్రితం రూ.30.80 ఉండగా ఈ నవంబర్‌లో రూ.41.90కి చేరింది. వాస్తవ వేతనాలు స్తంభించిపోయాయి. కుటుంబ పొదుపులు తగ్గిపోయి రుణాలు పెరిగిపోయాయి. అధికారిక సమాచారం ప్రకారమే నిరుద్యోగం పట్టణ ప్రాంతాలలో 6.7శాతం, గ్రామీణ ప్రాంతాలలో 4.2శాతం. శాశ్వత ఉద్యోగాలు ఎవరికీ దొరకడం లేదు.
ముందున్నది ముసళ్ల పండుగే. ద్రవ్యోల్బణం రేటు, నిరుద్యోగం రేటు మరింతగా పెరగనున్నాయి. ఆర్బీఐ త్వరలోనే రెపో రేటును 5.50శాతం నుంచి 5.75 లేదా 6శాతానికి పెంచే అవకాశమున్నది. పీఎల్ఐ పథకాలు (ఉత్పత్తిని పెంపొందించేందుకు ఉద్దేశించిన ప్రోత్సాహకాలు) సత్ఫలితాలనివ్వడం లేదని అధికారిక సమాచారమే స్పష్టం చేసింది. స్థూల దేశీయోత్పత్తిలో తయారీ రంగం వాటా 14శాతం వద్దనే నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం రేటు మరింతగా పెరగకుండా ఎలా ఉంటాయి? ద్రవ్యలోటు, వాణిజ్యలోటు (ముఖ్యంగా చైనాతో), ప్రైవేట్ పెట్టుబడుల కొరత, ప్రభుత్వ మూలధన వ్యయాల తగ్గుదల, మందకొడి డిమాండ్ మొదలైనవి మన ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్నాయి. అయితే ప్రభుత్వం జీడీపీ వృద్ధిరేటు పెరుగుదల గురించి లేని గొప్పలు చెబుతోంది. వికసిత్ భారత్ గురించి ప్రధానమంత్రి, మంత్రులూ ప్రతిరోజూ మాట్లాడుతున్నారు. లగ్జరీ కార్లు, నగరాల శివార్లలో ఖరీదైన బహుళ అంతస్తుల నివాస గృహాల గురించి రోజూ పత్రికలలో మిరుమిట్లు గొలిపే వాణిజ్య ప్రకటనలు వెలువడుతున్నాయి. ఇక ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న పెట్టుబడుల సదస్సుల గురించి చెప్పనవసరమే లేదు. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు దేశంలోకి ప్రవహిస్తున్నాయని పాలకులు ఘనంగా ప్రకటిస్తున్నారు. ప్రజలు వీటిని ఒక తమాషా వ్యవహారంగా పరిగణిస్తున్నారు.
ప్రజలు కోరుతున్నదేమిటి? ఉద్యోగాలు, వేతనాలు, తాగునీరు, విద్యుత్తు, రోడ్లు మొదలైనవి కదా. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దాదాపుగా నిలిపివేశారు. కాయకష్టంతో బతికేవారు అటువంటి ఆసరాకు ఆరాటపడుతున్నారు. పీఎల్ఐ పథకాలు వైఫల్యాల పుట్టలు. నైపుణ్యాల అభివృద్ధి పథకం అంతకుమించిన వైఫల్యం. తాగునీరు (జల్ జీవన్) పథకం ఎండిపోయింది. స్వచ్ఛ భారత్ మిషన్ ఒక ఘోర వైఫల్యం.
ఓట్ చోరీ వ్యతిరేక ఉద్యమం ఇండియా కూటమికి కొత్త బలాన్ని సమకూర్చింది. ఎన్డీఏకు గట్టి సవాళ్లను విసిరే శక్తి ప్రతిపక్ష కూటమికి లభించింది. ఇది నరేంద్రమోదీని కలవరపెడుతోంది. గురువారంనాడు ఫిక్కీ వార్షిక సమావేశంలో ఆయన చేసిన ప్రసంగమే అందుకు నిదర్శనం. ఓట్ చోరీ ఉద్యమ అనుభవంతో ప్రజలు ఎదుర్కొంటున్న మరిన్ని సమస్యలపై పోరాడేందుకు ఇండియా కూటమి సమాయత్తమవాలి. అటువంటి పోరాటాలు చేసినప్పుడే తిరుగులేని రాజకీయశక్తిగా ప్రభవించడం సాధ్యమవుతుంది.

దోపిడీ రూపం మారింది.. సారంలో కాదు!



డిజిటల్ భూస్వాములు.. క్లౌడ్ పాలేర్లు!' శీర్షికతో నవంబర్ 10న ఎం.కె.కుమార్ రాసిన వ్యాసంలో ఆయన చెప్పిన విషయాలు భూస్వాములకూ, పాలేర్లకూ సంబంధించినవి కావు. ఆన్లైన్‌లో వర్తకం చేసే పెట్టుబడిదారులను 'డిజిటల్ భూస్వాములు' అనీ, వినియోగదారులను 'క్లౌడ్ పాలేర్లు' అనీ ఒక సంస్కరణవాద ఆర్థికవేత్త ప్రతిపాదించిన పదాలను పొరపాటుగా ఉపయోగించారు. అందువల్లనే, ఇప్పుడున్నది 'కొత్త దోపిడీ వ్యవస్థ' అని, 'అస్థిరమైన కొత్త కార్మికవర్గం ఆవిర్భవించింది' అనీ కొన్ని పొరపాటు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.
ఏ వస్తువు కొనాలి? అన్న స్వేచ్ఛ కొనుగోలుదారులకు గతంలో ఉండేదనీ, ఆన్లైన్ వ్యాపారం వచ్చాక ఆ స్వేచ్ఛపోయిందన్నారు వ్యాసకర్త. అది కరెక్టు కాదు. అప్పుడైనా ఇప్పుడైనా ఏ వస్తువు కొనాలనే స్వేచ్ఛ కొనుగోలుదారులకు లేదు. పెట్టుబడిదారులు ఏ సరుకులు తయారు చేయిస్తారో, ఏ సరుకుల గురించి ప్రకటనలు విరివిగా ఇస్తారో, దానికి లోబడే కొనుగోళ్లు జరుగుతాయి. కాకపోతే, అప్పుడు షాపులకు వెళ్లి కొనుక్కోవడం ఉండేది, ఇప్పుడు ఆన్లైన్‌లో కొనుక్కునే పద్ధతి కూడా వచ్చింది.
'ఇప్పుడున్నది సంప్రదాయ పెట్టుబడి కాదు, అది క్లౌడ్ క్యాపిటల్' అన్నారు వ్యాసకర్త. ఈ 'క్లౌడ్ క్యాపిటల్' అనేది, సరుకుల్ని తయారు చేయించడానికి పెట్టే 'పారిశ్రామిక' పెట్టుబడి కాదు. 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్సు ప్రస్తావించిన 'వర్తక పెట్టుబడి' తప్ప, వేరుకాదు. వర్తక లావాదేవీలు షాపుల్లో జరుగుతున్నాయా, ఆన్లైన్‌లో జరుగుతున్నాయా అన్నదే తేడా. కుమార్ ప్రస్తావించిన కంపెనీలన్నీ వర్తక పెట్టుబడిదారీ కంపెనీలే. ఆన్లైన్‌లో వర్తకం చేసే కంపెనీల యజమానుల్ని 'డిజిటల్ భూస్వాములు' అనకూడదు. 'డిజిటల్ వర్తక పెట్టుబడిదారులు' అనాలి. ఆ కంపెనీలు 30--40శాతం కమీషన్ లాక్కుంటాయన్నారు. అవును మరి, పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో అది సహజం. సరుకులు తయారు చేయించిన పారిశ్రామిక పెట్టుబడిదారులు, తమ సరుకుల్ని తామే అమ్ముకునే ఏర్పాటు లేనప్పుడు, ఆ సరుకుల్ని అమ్మిపెట్టమని వర్తక పెట్టుబడిదారులకు ఇస్తారు. ఆ వర్తక పెట్టుబడిదారీ కంపెనీలు ఆ సరుకుల్ని వాటి పూర్తి విలువలకే అమ్మి, అలా అమ్మినందుకు కమీషన్ మినహాయించుకుని, మిగతాది సరుకు యజమానులకు ఇస్తాయి. ఇది పెట్టుబడిదారీ విధానం పుట్టినప్పటినించీ ఉన్నదే. తేడా ఏమంటే ఆన్లైన్ అనే కొత్త రూపమే. ఇంకా, వర్తక కమీషన్ అనేది 'మధ్యయుగాల నాటి భూస్వామి రైతుల నుంచి వసూలు చేసే శిస్తు' లాంటిదే' అని కుమార్ పొరపాటుపడ్డారు. ఏ శ్రమా చేయకుండా కౌలురైతుల నుంచి భూస్వామి లాగేది 'శిస్తు' కాదు. భూమి కౌలు. భూమి యజమాని ప్రభుత్వానికి చెల్లించే దానిని 'శిస్తు' అంటారు. అమెజాన్ వంటి ఆన్లైన్ వర్తక కంపెనీలకు చిన్న స్థాయి సరుకు పెట్టుబడిదారులు చెల్లించేది సామంతులు చెల్లించే కప్పం లాంటిది అని కుమార్ చాలా పొరపాటుగా పోల్చారు. అది 'వర్తక కమీషన్'.
కుమార్ తెచ్చిన ఇంకో పెద్ద తప్పు పోలిక ఏమిటంటే, కోట్లాదిమంది వినియోగదారులను 'క్లౌడ్ పాలేర్లు' అనడం. ఇంటర్నెట్ ముందు ఎన్ని వేల గంటలు గడిపినా, ఎన్ని వేల వీడియోలు చూసినా, ఏ సరుకూ తయారుకాదు. సరుకు తయారీకి కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కొంత శ్రమా కావాలి. వినియోగదారులు ఏ సాధనాలతో, ఏ శ్రమ చేసి, ఏ సరుకును తయారుచేస్తున్నట్టు? ఇలా భావించడం అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి సంబంధించి, మార్క్సు చెప్పినదానిని సరిగా గ్రహించలేదని అర్థం. పెట్టుబడిదారుల రాబడి రేటు పెరగడాన్ని అర్థం చేసుకోవడానికి, కుమార్ ఇచ్చిన ఉదాహరణ పూర్తిగా తప్పు. ఒక కంపెనీ యజమానికి, స్టాక్ మార్కెట్లో తన కంపెనీ షేర్ల విలువ పెరగడం వల్ల వచ్చిన డబ్బు తన దగ్గర పనిచేసే కార్మికుల నుంచి సంపాదించిన అదనపు విలువ కాదు. అది షేర్లు కొన్నవారి డబ్బు. దానిని మార్క్సు 'కల్పిత పెట్టుబడి' అన్నాడు. ఆ కంపెనీ యజమాని, ఆ కల్పిత పెట్టుబడిని, కొత్త ఉత్పత్తి కార్యంలో పెడితే, దాని ద్వారా కొత్త అదనపు విలువను సంపాదించవచ్చును. అది వేరే సంగతి. "ఇంతటి బహిరంగ దోపిడీ జరుగుతున్నప్పుడు ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?" అని ఒక అమాయకపు ప్రశ్న వేశారు కుమార్. జవాబు చాలా సింపుల్. ఇవి పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను రక్షించే ప్రభుత్వాలు గనక!
ఒక ఆర్థికవేత్త చేసిన విశ్లేషణను ప్రస్తావించి, 'నేటి సమాజంలో కొత్త వర్గం పుట్టుకొచ్చిందని' కుమార్ అమాయకంగా చెపుతున్నారు. ఉద్యోగ భద్రత లేని స్థితి వల్ల నిరంతరం ఏర్పడుతున్న నిరుద్యోగుల్నీ, పార్టు టైం ఉద్యోగుల్నీ, ఇంకా అలాంటివారిని ఉదాహరణలుగా చూపారు. ఇది 'కొత్త వర్గం' కానేకాదు. పెట్టుబడిదారీ విధానం ఎప్పటికప్పుడు, కార్మికులలో ఒక భాగాన్ని నిరుద్యోగంలోనో, చిరుద్యోగంలోనో ఉంచుతుందనీ, వారిని 'అదనపు జనాభా'గా పెట్టుబడిదారులు భావిస్తారనీ మార్క్సు ఏనాడో చెప్పాడు. వాళ్లకే, ఈనాటి కొత్త ఆర్థికవేత్తలు కొత్త పేర్లు పెడతారు. వ్యాసకర్త భావిస్తున్నట్టు, ఇప్పుడున్నది 'కొత్త దోపిడీ వ్యవస్థ' కాదు. దాని రూపమే మారింది తప్ప, సారం ఏమీ మారలేదు. దాన్ని సమూలంగా మార్చడానికి, మార్క్సు చూపిన మార్గాన్ని మించి, "కొత్త తరహా పోరాటమార్గం" ఏదీ లేదు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం: చిన్నారులకు రెండు చుక్కలు తప్పనిసరి – మాజీ మేయర్ కోటేష్ గౌడ్

జవహర్ నగర్, నవంబర్ 22:(వార్త ప్రతినిధి)

ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ మేయర్, జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ పిలుపునిచ్చారు.

జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ మెయిన్ రోడ్ సెంటర్ లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోటేష్ గౌడ్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, ఎన్టీఈపీ ప్రోగ్రాం ఆఫీసర్ డా. శ్రీదేవి, యూపీహెచ్‌సీ జవహర్ నగర్ మెడికల్ ఆఫీసర్ డా. హారతితో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.





ఈ సందర్భంగా కోటేష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తమ పిల్లలకు రెండు చుక్కలు వేయించి, వారి ఆరోగ్యకర భవిష్యత్తుకు భరోసా కల్పించాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చూడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కోశాధికారి పొలాస కిరణ్, చంద్రపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ కోశాధికారి నంగునూరి అశోక్ గుప్తా, అంగన్వాడీ టీచర్ బి. జయ, ఆశా వర్కర్ డి. స్వరూప, స్థానిక నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్ లో పల్స్ పోలియోకు విశేష స్పందన

జవహర్ నగర్, నవంబర్ 22:(వార్త ప్రతినిధి)

పోలియో రహిత భారతదేశం సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా, విజయవంతంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా హాజరయ్యారు. వారిద్దరూ చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ, తల్లిదండ్రులకు పోలియో చుక్కల ప్రాధాన్యతను వివరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియోను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.





తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు, భయాలకు లోనుకాకుండా తమ పిల్లలకు రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఇదే వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు భరోసా అని పేర్కొన్నారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ కుతాడి సాయికుమార్, చిత్ర సుబ్రహ్మణ్యం, వెంకటేష్, నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కౌశిక్ రెడ్డి రాజీనామాకు సిద్ధమా...

- పెన్షన్ విషయంలో కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను ఆధారాలతో బయటపెట్టిన ప్రణవ్...
- ఎమ్మెల్యే తీరుపై లబ్ధిదారుల ఆగ్రహం..
- సంక్షేమ పథకాలపై బిఆర్ఎస్ తన అక్కసును వెళ్లగక్కుతుందని ప్రణవ్ ఆగ్రహం.
- చనిపోయిన వారికి కూడా పెన్షన్ ఇవ్వాలా కౌశిక్ రెడ్డి??

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్ 22

పేదలకు అందించే సంక్షేమ పథకాలపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపట్ల తీవ్రంగా ఖండించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గానికి కొత్తగా 4,221 పెన్షన్ మంజూరు చేశామని అన్నారు.ఆదివారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి సొంత గ్రామం వీణవంక లో 28 కొత్త పెన్షన్ లు ఇచ్చామని లబ్ధిదారుల సమక్షంలో ఆధారాలతో బయటపెట్టారు.కౌశిక్ రెడ్డి మాట్లాడేవాన్ని బట్టేబాజ్ ముచ్చట్లే అని,నియోజకవర్గ వ్యాప్తంగా వితంతులకు 1980,వికలాంగులు 1133,గీత కార్మికులకు 553,చేనేత కార్మికులకు 145,ఒంటరి మహిళలకు 311 పెన్షన్ లను అందజేశామని అన్నారు.స్వయంగా కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే పదవిలో ఉండి ఇవి పంచాడని ఇప్పుడు సిగ్గు లేకుండా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.





బుద్ధి తెచ్చుకో కౌశిక్ రెడ్డి..

మీడియా సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే,మాజీ మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గానికి 6 వేల కొత్త పెన్షన్ మంజూరు అయ్యాయని వాటిని మీడియా ముఖంగా వెల్లడించారని ఆ వీడియో మీడియా ప్రతినిధులకు చూపించారు.ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా అవగాహన రాహిత్యంగా మాట్లాడడం హుజురాబాద్ నియోజవర్గానికి పట్టిన శని అని,హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు హుజురాబాద్ కు పట్టిన శని ఎప్పుడు వదులుతుందా అని ఆలోచించుకుంటున్నారని అన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు పరుస్తున్నాం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు పరుస్తున్నామని,స్వయంగా కౌశిక్ రెడ్డి వీణవంక మండలంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల గృహ ప్రవేశానికి హాజరయ్యారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ప్రజలకు అందుతుంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు.రైతులకి రుణమాఫీ విషయంలో నియోజవర్గవ్యాప్తంగా 33,158 మంది రైతులకు 248.5 కోట్ల నిధులతో రుణమాఫీ జరిగింది అని అన్నారు.ధరల పెరుగుదల విషయంలో రేట్లు ఎవరు పెంచుతారో తెలివిలేని వ్యక్తి కౌశిక్ రెడ్డి అని గ్యాస్,గుడ్డు ధరలు ఎవరు పెంచుతారో తెలివిలేని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అని అన్నారు.

రేవంత్ రెడ్డితో పోల్చుకునే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు..

కింది స్థాయి నుండి స్వయం కృషితో ఎదిగి,జడ్పీటీసీ స్థాయి నుండి,ఎమ్మేల్యేగా ఎమ్మెల్సీగా,ఎంపీగా,ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఎదిగిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని,తనతో పోల్చుకునే స్థాయి బిఆర్ఎస్ నాయకులకు లేదని,పులిని చూసి నక్క వాత పెట్టుకుంటే పులి కాదని అన్నారు.2009 లో ప్రతిపక్షంలో ఉన్నా కూడా కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారనీ,కొడంగల్ ప్రాంతానికి ఐటీఐ కాలేజీ,కోస్గి బస్ డిపో లాంటి అనేక అభివృద్ధి పనులు చేశారనీ,సిరిసిల్ల ప్రాంతానికి చిన్నబాస్ కేటీఆర్ 2009 ఏం చేశాడో కౌశిక్ రెడ్డి చెప్పగలుగుతాడా అని ప్రశ్నించారు.

పెన్షన్ ల విషయంలో ఆధారాలు చూపిస్తేఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పిన కౌశిక్ రెడ్డి వెంటనే రాజీనామా చేసి అంబేద్కర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని,ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

హబ్సీగూడలో విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం.. పాల్గొన్న కంది శ్రవణ్ కుమార్ రెడ్డి

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజ నిర్మాణానికి పిలుపునిచ్చిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి

హబ్సీగూడ, నవంబర్ 22 (మన మీ వార్త):

హబ్సీగూడ డివిజన్‌లో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. గాంధీ గిరిజన బస్తీ, స్ట్రీట్ నంబర్ -1లోని బస్తీ దవాఖాన, జీజీ కాలనీ అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి సందర్శించారు.

ఈ సందర్భంగా బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఖరీముద్దీన్, ఆశా కార్యకర్తలతో కలిసి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలియో నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఐదేళ్లలోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కంది శ్రవణ్ కుమార్ రెడ్డి కోరారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించడం ద్వారా పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.





ఈ కార్యక్రమంలో హబ్సీగూడ డివిజన్ సీనియర్ నాయకులు గన్నారం విజయ్ కుమార్, ధర్మా నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు నాయక్, సాయి కుమార్, సుమన్ నాయక్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్,నవంబర్ 22 (మన మీ వార్త):



ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ) నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ



సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టడంలో ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకూడదని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సౌశిల్య రాణి, వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

ప్రజయ్ షెల్టర్స్‌లో చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ

మియాపూర్ నవంబర్ 22 మన మీ వార్త ప్రతినిధి హేమాప్రియ



మియాపూర్: పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నవంబర్ 22న జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా మియాపూర్‌లోని ప్రజయ్ షెల్టర్స్‌లో చిన్నారులకు పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజయ్ షెల్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శంకరాచారి, ట్రెజరర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఈ సందర్భంగా సూచించారు. పోలియో వ్యాధి నుంచి చిన్నారులను రక్షించేందుకు ప్రతి విడతలోనూ పోలియో చుక్కలు వేయించడం ఎంతో అవసరమని అవగాహన కల్పించారు.



ఈ కార్యక్రమంలో చందానగర్ సుమన్ కాలేజీ నర్సింగ్ బృందం సభ్యులు మంజుల, ఏంజిల్ బీజు, ఫెబాటోమీ, సంధ్ర మోల్‌తో పాటు వైద్య సిబ్బంది, ఆశా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారులకు ఎంతో ఓపికతో పోలియో చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించి ఆరోగ్య శాఖ కార్యక్రమాలకు సహకరించాలని నిర్వాహకులు కోరారు.

వెంకట్ రెడ్డి నగర్‌లో పోలియో చుక్కలు పంపిణీ చేసిన ఆకారపు అరుణ్ పటేల్

- 55 మంది ఆశా వర్కర్ల సేవలను అభినందిస్తూ వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు





వెంకట్ రెడ్డి నగర్, నవంబర్ 22 (మన మీ వార్త):

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లో నిర్వహించిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో యువ నాయకుడు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తగా పోలియో చుక్కలు వేయాలని ఆశా వర్కర్లకు సూచించారు. ఆదివారం సెలవు దినమైనప్పటికీ, ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజారోగ్యం కోసం విధులు నిర్వహించిన 55 మంది ఆశా వర్కర్ల సేవలను ఆకారపు అరుణ్ పటేల్ ప్రత్యేకంగా అభినందించారు.ఆశా వర్కర్ల సేవలకు కృతజ్ఞతగా వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ప్రజారోగ్య కార్యక్రమాల్లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది సేవలను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నామ్ రాజి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బిళ్ళకంటి బొట్టు యాదయ్య, కాలనీ యువ నాయకుడు మడిపోజు హరీష్ చారీ, నాగరాజు, రాజేష్, సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున గౌడ్





నాచారం, నవంబర్ 22 (మన మీ వార్త):

నాచారం 21వ డివిజన్ పరిధిలో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాచారం వార్డు కార్యాలయం, ఎర్రకుంట మండల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున గౌడ్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు పోలియో నివారణలో చుక్కల ప్రాముఖ్యతను వివరించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేడల మల్లికార్జున గౌడ్ సూచించారు.పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. చిన్నారుల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తు అని, పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు తంబాడి మాధవి, సాగ యమున, బీఆర్ఎస్ నాయకులు టేకులపల్లి రామచందర్, మహమ్మద్ యూసుఫ్, మ్యాగ్నెట్ మల్లేష్, గొల్లూరి ప్రభాకర్, బొడ్డు శివ, బంధుగుల, రాకేష్, జంగ శ్రీధర్, లడ్డు, తండా ఈశ్వర్ గౌడ్, గద్ద సురేందర్, నర్సింగ్ రావు, జంగం నర్సింగరావు, పల్లపు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పొంగి రోడ్డుపై మురుగు నీరు... ఇబ్బందుల్లో కాలనీ ప్రజలు

- నాలుగు నెలలు నుంచి డ్రైనేజీ పొంగి మురుగునీరు రోడ్డుపై నిలుస్తున్న పట్టించుకోని మున్సిపల్ అధికారులు.

బోడుప్పల్ సర్కిల్ నవంబర్ 22 (మన మీ వార్త)





మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలుగు నెలల నుంచి డ్రైనేజీ పొంగి మురుగునీరు రోడ్డుపై నిలుస్తున్న పట్టించుకోని అధికారులు. వివరాల్లోకి వెళితే..బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో డ్రైనేజీ బిల్లా పగిలి మురుగునీరు రోడ్డుపై గత నాలుగు నెలల నుంచి పొంగిపొర్లుతుంది. ఈ విషయం పై మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు, చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. కాగా రోడ్డుపై మురుగునీరు నిలవడం వలన దోమలు, ఈగలు తమ నివాసం గృహాన్ని ఏర్పరుచుకొని వీర విహారం చేస్తూ ఇండ్లలో సంచరిస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. దీనివల్ల డెంగ్యూ, మలేరియా మొదలైన ప్రాణాంతక వ్యాధులు సోకే అవకాశం ఉందని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా బోడుప్పల్ మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని స్థానిక కాలనీ ప్రజలు కోరారు.

ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ బీఎం సందీప్ కుమార్‌తో మంత్రులు జూపల్లి, వాకిటి భేటీ

- కొత్త బాధ్యతలు చేపట్టిన సందీప్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు

- తెలంగాణ రాజకీయాలు, పార్టీ వ్యవహారాలపై మర్యాదపూర్వకంగా సమావేశం

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 22 మీ వార్త :



ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్ కుమార్‌ను రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన సందీప్ కుమార్‌కు మంత్రులు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ భేటీ సందర్భంగా సందీప్ కుమార్‌కు అభినందనలు తెలిపిన మంత్రులు, తెలంగాణ రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం తదితర అంశాలపై పరస్పరం మాట్లాడుకున్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజలకు మరింత చేరువయ్యేలా పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలకు నూతన ఇంచార్జ్‌గా సందీప్ కుమార్ మార్గదర్శకత్వం ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నూతన ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది...

20 ఏళ్ల నరకానికి ముగింపు పలకండి:
జవహర్ నగర్ లో రిలే దీక్షలతో మోగిన డంపింగ్ యార్డు వ్యతిరేక నినాదం

జవహర్ నగర్, నవంబర్ 22:(వార్త ప్రతినిధి)

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జవహర్ నగర్ డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని, కొత్త చెత్తను రాంకీ డంపింగ్ యార్డుకు తీసుకురావడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు దీక్షలు విజయవంతంగా ముగిశాయని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ జేఏసీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ప్రకటించారు.

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా, కీసర సర్కిల్, జవహర్ నగర్ పరిధిలోని చెన్నాపురం చౌరస్తాలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆదివారం రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి హాజరయ్యారు. తనదైన శైలిలో పాట, మాట, నినాదాలతో దీక్షా శిబిరాన్ని ఉత్తేజపరిచి, ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, 20 ఏళ్లుగా జవహర్ నగర్ ప్రజలు డంపింగ్ యార్డు కాలుష్యంతో నరకం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, కలుషిత నీరు, విషపూరిత గాలితో పిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. రోజుకు ఇద్దరు చొప్పున మరణిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందని చెప్పారు.

హైదరాబాద్ నగరం మొత్తం చెత్తను ఒకే చోట



వేయడం వల్లే ఈ సమస్య వచ్చిందని, చెత్తను డిసెంట్రలైజ్ చేసి నాలుగు మూలలా చిన్నచిన్న ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును శాస్త్రీయంగా మూసివేసే వరకు, కొత్త చెత్త రాకుండా ఆపే వరకు ఈ రిలే దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి పాత చెత్తను రీసైకిల్ చేసి యార్డును తొలగించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ, దమ్మాయిగూడ జేఏసీతో కలిసి ఐక్యంగా ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఈ దీక్షలకు ఎంపీ ఈటెల రాజేందర్, అధికార కాంగ్రెస్ డీసీసీ వజ్రేష్ యాదవ్ కూడా మద్దతుగా నిలబడాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో యాంటి డంపింగ్ యార్డు జేఏసీ దమ్మాయిగూడ నాయకులు, వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఐ దర్శనం యాదగిరి, నిమ్మల నర్సింహ్మ, సీపీఎం శివనారాయణ, కె. సురేందర్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జయసుధ, సురేందర్, బీఎస్పీ బిర్రు యాకస్వామి, ఆమ్ ఆద్మీ పార్టీ మొయిన్, టీఆర్ఎస్ మేక లలిత యాదవ్, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వి. ప్రవీణ్, డి. స్వరూప, ఎంఎల్పీఐ (రెడ్ ఫ్లాగ్) ఖాసీం, లింగస్వామి, టీజేఎస్ ఎం. శ్రీనివాస్, టీడీపీ టి. శ్రీరాములు, టీయూజేఏసీ ఎ. లలిత, డి. లలిత, యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసీ సమ్మిరెడ్డి, స్వర్ణ తమ సంపూర్ణ మద్దతు తెలియజేసి దీక్షలో పాల్గొన్నారు.

టీయూజేఏసీ తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, పీఓడబ్ల్యూ సంధ్య, సీఎంఎస్ సత్య, పీకేఎం జూన్, ఏఐఎఫ్టీయూ వై. మల్లేష్, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మహ్మద్ పాషామియా, టి. కాలేషా, ప్రజానాట్యమండలి వెంకటాచారి, ఉద్యమ కళాకారుల వేదిక యాదగిరి, మహిళా విభాగం సుజి, పీఓడబ్ల్యూ (విముక్తి) గడిపే సునీత, సీఎంఎస్ జయ, కార్మికనగర్ దామాల ప్రభాకర్, శ్రీనివాస్, పీడీఎం రవి, సీజేపీ శ్రావణ్ కుమార్ తదితర సంఘాల నాయకులు హాజరై సందేశాలు ఇచ్చారు.

డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జూన్, వెంకటాచారి కళాకారులు ఆలపించిన ఉద్యమ పాటలు అందరినీ ఆకట్టుకుని దీక్షలో పాల్గొన్న వారికి ఎంతో ఉత్తేజాన్నిచ్చాయి.

ఇంద్రానగర్‌లో బస్తీ బాట కార్యక్రమం
నిర్వహించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ రఫీక్

- క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలన.. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ

రామంతాపూర్, నవంబర్ 22 (మన మీ వార్త):





ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో రామంతాపూర్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్, శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం మూడో గల్లీలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ రఫీక్ బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులతో మమేకమైన ఆయన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఆయా సమస్యలను పరిశీలించి, ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు.కాలనీలో నెలకొన్న సమస్యలను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆయన సహకారంతో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తామని మహమ్మద్ రఫీక్ హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలే తమ ప్రాధాన్యతని, ప్రజల భద్రత తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం ప్రజాసేవలో భాగమని తెలిపారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర భాస్కర్, నార్ల అశోక్, నేహాల్, దత్తు, ఎండీ షకీల్, స్వామి, ముత్యాల యోగి, శివరాక్, ఎండీ మతిన్, నరేష్, నాగరాజు, స్థానిక మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే బస్తీ బాట కార్యక్రమం లక్ష్యం.

ప్రజలతో మమేకమవుతూ.. సామాజిక, సాంస్కృతిక
కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న యలమంచి ఉదయ్ కిరణ్

మియాపూర్ నవంబర్ 22 మన మీ వార్త ప్రతినిధి హేమా ప్రియ

మియాపూర్: ప్రజాసేవే లక్ష్యంగా ప్రజలతో నిరంతరం మమేకమవుతూ సామాజిక సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక వేదుకల్లో చురుకుగా పాల్గొంటున్న మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ ఇటీవల మియాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఏఎస్ రాజు నగర్‌లో కార్తీక మాస వనభోజనాలు

మియాపూర్‌లోని ఏఎస్ రాజు నగర్ టెంపుల్ పార్క్‌లో ఆరోబిందో కాలనీ, దత్తసాయి నగర్ వాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజనాల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్తసాయి నగర్ అధ్యక్షుడు స్వామి రవికృష్ణ, ఆరోబిందో కాలనీ ప్రతినిధులు రమేష్, లోకేష్ తదితరులను కలుసుకున్నారు.

సామూహిక వనభోజనాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ప్రజల మధ్య సోదరభావం, ఆత్మీయత, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

అనంతరం మియాపూర్‌కు చెందిన సీనియర్ సిటిజన్లు గోపీనాథ్, సుబ్బారాయుడు, హనుమంతరావు, సుబ్బారెడ్డి, వెంకట నాయుడు, విష్ణు ప్రసాద్, శ్రీరామ్, జనార్ధన్ తదితరులను కలిసి వారి ఆశీస్సులు స్వీకరించారు.

పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఉదయ్ కిరణ్

ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలోని జేపీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని యలమంచి ఉదయ్ కిరణ్ సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జేపీ నగర్ అసోసియేషన్ సభ్యులు మోహన్ రెడ్డి, ఆంజనేయులు, జనార్ధన్ రెడ్డి, శరత్, రత్నాచారి, వంశీ, సాయి నిఖిల్, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ కమ్మ సంఘం వనభోజనాల్లో ముఖ్య అతిథులుగా

కొండాపూర్ కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజనాల కార్యక్రమానికి నిర్వాహకులు కొల్లి క్రాంతి, మద్దినేని శివ, కనిగంటి శశాంక్ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర కమ్మ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, యలమంచి ఉదయ్ కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువత సంప్రదాయాలను గౌరవిస్తూ భావితరాలకు వాటిని అందించాలని సూచించారు.

అనంతరం టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సామాజిక, సాంస్కృతిక అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. కొండాపూర్‌కు చెందిన సీనియర్ సిటిజన్లు, స్థానిక ప్రముఖులు, కుటుంబ సభ్యులను కలిసి వారి ఆశీస్సులు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో చలసాని భారతి, రవి, శరత్, వంశీ, నాగసాయి, రత్నాచారి, సాయి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమే నిజమైన ప్రజాసేవ

ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలు, అవసరాలను తెలుసుకోవడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.

సీనియర్ సిటిజన్ల ఆశీస్సులు, యువత సహకారం, మహిళల భాగస్వామ్యం, కాలనీ వాసుల ఆదరాభిమానాలతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఐక్యత, పరస్పర సహకారం, సామాజిక బాధ్యతతోనే అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమని యలమంచి ఉదయ్ కిరణ్ తెలిపారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

గాంధీభవన్‌కు తొలిసారిగా విచ్చేసిన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ బీఎం సందీప్ కుమార్‌కు ఘన స్వాగతం

- శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ కోట్ల రవి

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 22 మీ వార్త :



గాంధీభవన్‌కు తొలిసారిగా విచ్చేసిన ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ బీఎం సందీప్ కుమార్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ కోట్ల రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతలు చేపట్టినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కోట్ల రవి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, పార్టీ శ్రేణులకు తగిన మార్గదర్శకత్వం లభించాలని ఆకాంక్షించారు.గాంధీభవన్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా నూతన ఇన్‌చార్జ్‌ను శాలువాతో సత్కరించడం ద్వారా కోట్ల రవి తన అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు...

హ్యాండ్‌బాల్‌లో మెరిసిన వనపర్తి అమ్మాయిలు!

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు ఆరుగురు క్రీడాకారిణుల ఎంపిక

- డిసెంబర్ 3 నుంచి నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటనున్న వనపర్తి క్రీడాకారిణులు



ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 22 మీ వార్త :

వనపర్తి జిల్లా న్యూస్ : క్రీడారంగంలో వనపర్తి జిల్లా అమ్మాయిలు తమ ప్రతిభను చాటుకుంటూ మరోసారి సత్తా చాటారు. జడ్చర్ల మినీ స్టేడియంలో నిర్వహించిన సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు మొత్తం 16 మంది క్రీడాకారిణులు ఎంపికయ్యారు. వీరిలో వనపర్తి జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారిణులు చోటు దక్కించుకోవడం విశేషం.వనపర్తి జిల్లాకు చెందిన మహేశ్వరి, హిమబిందు, భవాని, నందిని, రాణి, ప్రీతి తమ క్రీడా ప్రతిభతో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన ఈ క్రీడాకారిణులు డిసెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు నల్గొండలో నిర్వహించనున్న 55వ తెలంగాణ అంతర్ జిల్లాల సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నారు.ఒకే జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారిణులు ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక కావడం వనపర్తి క్రీడారంగానికి గర్వకారణంగా నిలుస్తోంది. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు...

పోలియో చుక్కలు వేయిద్దాం.. పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం!

- ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి: బాలమురళీకృష్ణ

పటాన్‌చెరు, నవంబర్ 22, మీ వార్త ప్రతినిధి:



చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమురళీకృష్ణ (చిన్న ముదిరాజ్) అన్నారు. నవంబర్ 22న నిర్వహించే పోలియో కార్యక్రమం సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.పోలియో మహమ్మారిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పోలియో వ్యాధి నుంచి చిన్నారులను రక్షించేందుకు ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పేర్కొన్నారు.పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని, ఐదేళ్లలోపు చిన్నారులెవరూ పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని బాలమురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

లక్ష్మీనరసింహ స్వామికి కార్తీక దీప నీరాజనం

-భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (22):



కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు,కార్తీక దీప నీరాజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించి కార్తీక దీప నీరాజనం సమర్పించారు. అనంతరం పలువురు భక్తులు సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

కార్తీక మాసం ప్రాముఖ్యతను పురస్కరించుకొని గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.దీపాల వెలుగులు, భక్తుల పూజలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కుటుంబ సమేతంగా పాల్గొన్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి సారా శ్రీనివాస్,ఆలయ అర్చకులు ధనుంజయ శర్మ, విద్యాకర్ చారి,జూనియర్ సహాయకుడు నరసింహారెడ్డి,పలువురు భక్తులు పాల్గొన్నారు.

నాచారం ఎర్రగుంటలో ఘనంగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం





- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేడల మల్లికార్జున గౌడ్

- ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రైటినోవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

నాచారం, నవంబర్ 22 (మన మీ వార్త):

నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రగుంటలో రైటినోవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు బొడ్డు శివ, పల్లపు రంగస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించిన ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. శిబిరంలో కంటి పరీక్షలు, రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) పరీక్షలతో పాటు పలు ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందజేశారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా మేడల మల్లికార్జున గౌడ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బొడ్డు శివ, పల్లపు రంగస్వామి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలను చేరువ చేయడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.ప్రజా సేవే లక్ష్యం.. ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం అనే సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.ఈ కార్యక్రమంలో రైటినోవా ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్, నేత్ర వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్, దంత వైద్యులు డాక్టర్ శ్రీవిద్య, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శేఖర్, బీఆర్ఎస్ నాయకులు టేకులపల్లి రామచందర్, మహమ్మద్ యూసుఫ్, మ్యాగ్నెట్ మల్లేష్, గొల్లూరి ప్రభాకర్, బంధుగుల, రాకేష్, జంగ శ్రీధర్, లడ్డు, తండా ఈశ్వర్ గౌడ్, గద్ద సురేందర్, నర్సింగ్ రావు, జంగం గాంధామల మల్లేష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ బ్లాస్ట్ బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ యువ నాయకుడు ఆకారపు అరుణ్ పటేల్

- బాధిత కుటుంబానికి రూ.46 లక్షల పరిహారం అందేలా కృషి

ఉప్పల్, నవంబర్ 22 (మన మీ వార్త):

రామంతాపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని హెరిటేజ్ కంపెనీలో జరిగిన పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మహిళ కుటుంబానికి అండగా ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ నిలిచారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించి, యాజమాన్యం మరియు సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి మొత్తం రూ.46 లక్షల ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు.ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి కంపెనీ



యాజమాన్యం ద్వారా రూ.25 లక్షల పరిహారం, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.2 లక్షలు, మహిళకు సంబంధించిన ఇన్సూరెన్స్ ద్వారా రూ.19 లక్షలు అందేలా సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకునేందుకు చొరవ చూపారు.విషాద ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వారికి న్యాయం జరిగేలా ఆకారపు అరుణ్ పటేల్, కాంగ్రెస్ నాయకుడు రఫీక్ కృషి చేయడం పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారు ఈ కష్టకాలం నుంచి ధైర్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రఫీక్, యువజన కాంగ్రెస్ నాయకులు సచిన్, రఘు, పాషా, నవీన్, సాయి నాగరాజు, మహేష్, శ్రీను, సలీం, అలీ, చింటూ, కలీం, అశోక్, సుమిత్, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గాల హక్కుల సాధనే ధ్యేయం... కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం!

- 34 మందితో జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ నూతన కమిటీ ఏర్పాటు

- పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి... కార్యకర్తలకు ఈరపోగు రాజ్‌కుమార్ పిలుపు

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 22 మీ వార్త :

వనపర్తి టౌన్ న్యూస్ : కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు, ఎస్సీ వర్గాల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ విభాగం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు ఈరపోగు రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం 34 మంది సభ్యులతో కూడిన నూతన జిల్లా కమిటీని ప్రకటించారు.ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు.ముఖ్యంగా ఎస్సీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉండాలని నూతన కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. కమిటీలో బాధ్యతలు పొందిన ప్రతి ఒక్కరూ పదవులను హోదాలుగా కాకుండా ప్రజలకు, పార్టీకి సేవ చేసే అవకాశాలుగా భావించాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంపొందిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఐక్యత, క్రమశిక్షణ, సమష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేయాలని,



ఎస్సీ వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీ, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గంధం రాజశేఖర్, కౌన్సిలర్ గంధం శరబంధ, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కొల్లా వెంకటేష్, పెద్దమందడి మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటేష్, టౌన్ అధ్యక్షుడు గొర్ల అనిల్ తదితరులు, నూతన కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు...

ఇందిరమ్మ ఇళ్ల పథకం... పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం

- చెంగిచెర్ల ఎస్సీ బస్తీలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన - మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

బోడుప్పల్ సర్కిల్ నవంబర్ 22 (మన మీ వార్త)

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ ఎస్సీ బస్తీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం ద్వారా వారి సొంతింటి కల నెరవేరుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కల్యాణ్, మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ , దానగళ్ళ యాదగిరి, బొమ్మక్ శ్రీనివాస్, యాకూబ్,



కుర్రి శంకర్, కుర్రి మహేష్, ఉపేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

కాళికామాత ఆలయ పునర్నిర్మాణానికి రావుల చేయూత!

- ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి
- ఆధ్యాత్మికతకు దేవాలయాలు నిలయాలు,భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆలయాలు ఎంతో అవసరం: రావుల

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 22 మీ వార్త :

వనపర్తి జిల్లా న్యూస్ : ఖిల్లా గణపురం మండల కేంద్రంలోని కమ్మరి గిరి శివాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కాళికామాత ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆర్థిక సాయం



అందజేశారు.

ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...మానవ జీవితంలో మానసిక ప్రశాంతతకు దేవాలయాలు నిలయాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆలయాలు కేవలం పూజా మందిరాలే కాకుండా ఆధ్యాత్మిక చింతనకు, భక్తి భావానికి కేంద్రాలుగా ఉంటాయని అన్నారు. సమాజంలో భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించడంలో దేవాలయాల పాత్ర ఎంతో ముఖ్యమైనదని అభిప్రాయపడ్డారు.

కాళికామాత ఆలయ పునర్నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, అమరేందర్, కాళికామాత ఆలయ కమిటీ సభ్యులు వడ్ల జానకి రాములు, పులేందర్ చారి, బ్రహ్మయ్య చారి, శ్రీనివాసులు చారి, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు...

కౌకూర్ లో వెలిగిన కొత్త వెలుగులు: భారత్ నగర్ ప్రధాన రహదారిలో 10 నూతన వీధి దీపాలు ప్రారంభం

కౌకూర్, నవంబర్ 22:(వార్త ప్రతినిధి)

మిషన్ బ్రైట్ కౌకూర్ లో భాగంగా వెలుగుల కౌకూర్ దిశగా మరో ముందడుగు పడింది. మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ నిరంతర కృషి, ఫాలోఅప్ ఫలితంగా కౌకూర్ భారత్ నగర్ ప్రధాన రహదారి మరియు ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో మొత్తం 10 నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగింది.

మైనంపల్లి హనుమంతరావు డైనమిక్ నాయకత్వంలో ఈ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ, ఈ వీధి దీపాల ఏర్పాటు వల్ల స్థానిక ప్రజలు, విద్యార్థులు, పాదచారులు మరియు వాహనదారులకు మెరుగైన వెలుతురు, భద్రత కలుగుతాయని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల, బస్తీ దవాఖాన మరియు సీనియర్ సిటిజన్లకు నిత్యం సేవలందిస్తున్న ఫౌండేషన్ పరిసరాల్లో ఈ వెలుతురు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.





అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడటంతో పాటు ప్రజలకు మరింత సురక్షితమైన వాతావరణం ఏర్పడుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్యేక కృతజ్ఞతలు:
- సూపరింటెండింగ్ ఇంజినీర్ లక్ష్మణ్
- డీఈ శ్రీమతి కవిత
- క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసిన సూపర్ వైజర్ అశోక్ ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు.

ఇదే స్ఫూర్తితో కౌకూర్ ను పూర్తిగా వెలుగుల కౌకూర్ గా మార్చేందుకు కృషి కొనసాగుతుందని మల్లికార్జున్ స్పష్టం చేశారు.

చిలుకా నగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో పాత్రికేయులకు ఘన సన్మానం

- ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు -- బొమ్మగోని దాసుగౌడ్

చిల్కానగర్, నవంబర్ 22 (మన మీ వార్త):

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, చిల్కానగర్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది ప్రముఖ పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. సంఘ అధ్యక్షుడు బొమ్మగోని దాసుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాత్రికేయులకు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా బొమ్మగోని దాసుగౌడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తోందన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను నిర్భయంగా ప్రశ్నించడం వంటి బాధ్యతాయుతమైన సేవలను పాత్రికేయులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు.ఎండనక, వాననక, పగలనక, రాత్రనక ప్రజా సమస్యల పరిష్కారం కోసం



నిరంతరం వార్తా సేకరణలో నిమగ్నమవుతూ ప్రజల ఆదరాభిమానాలతో పాటు అధికారుల ప్రశంసలు పొందుతున్న పాత్రికేయుల సేవలు అభినందనీయమన్నారు. సమాజ అభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని, బాధ్యతాయుతమైన జర్నలిజం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని పేర్కొన్నారు.

అదేవిధంగా, సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, ఆరోగ్యం, భద్రత, సంక్షేమ కార్యక్రమాలకు పత్రికా రంగం మరింత ప్రాధాన్యతనివ్వాలని కోరారు.కదరి బాలేశం -- (నిఘా న్యూస్ నెట్వర్క్ ఇంచార్జ్),వడ్డేపల్లి కిషోర్ -- ఉప్పల్ ప్రెస్ క్లబ్(ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా) అధ్యక్షులు,తిరుపతిరెడ్డి --ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు,వెంకటరమణారెడ్డి -- ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్ట్,నరసింహారెడ్డి -- ప్రజాజ్యోతి పాత్రికేయుడు,ప్రవీణ్ -- విశాల తెలంగాణ విలేకరి,నరోత్తమ్ రెడ్డి -- ప్రజాపాలన పత్రిక జర్నలిస్ట్ పాషా -- తెలుగు ప్రభ పత్రిక పాత్రికేయులు తదితరులను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు, పలువురు సీనియర్ సిటిజన్స్ పాల్గొని సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలిపారు.సన్మానం పొందిన పాత్రికేయులు మాట్లాడుతూ తమకు అందించిన గౌరవానికి తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, చిల్కానగర్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ సీనియర్ సిటిజన్స్ సమస్యలతో పాటు ఉప్పల్ ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై పలు గ్రామాల్లో అవగాహన కల్పించిన ఎమ్మెల్యే జీఎస్సార్.

.నవంబర్ 22,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త

భూపాలపల్లి శాయంపేట మండలం నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో , శాయంపేట, పత్తిపాక, పెద్దకోడపాక గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల ప్రజలు, రైతులు, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ముఖ్య ఉద్దేశ్యం, ప్రయోజనాలు, అర్హతలు, దరఖాస్తుకు అవసరమైన పత్రాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, పథకానికి సంబంధించిన నియమ నిబంధనలను వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను స్వయంగా పరిశీలిస్తూ, ప్రజలకు పథకంపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం, ఆర్థిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా భరోసా కల్పించడంలో కుటుంబ జీవిత బీమా పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంతో పాటు ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తీసుకువస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ, గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు వంటి పథకాల ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.అదేవిధంగా భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్..

అనంతరం తహరాపూర్, పెద్దకోడపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖ అధికారులు, రైతులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ లో ఆట మొదలు పెడుతున్న కేంద్ర బిజెపి నేతలు

- అధికారం కోసం పావులు కదుపుతున్న అమిత్ షా
- మూడురోజుల్లో ముగ్గురు జాతీయ నేతల పర్యటనలు
- నేడు కరీంనగర్‌లో నితిన్ నబీన్.. మహా పాదయాత్రకు హాజరు
- 24న హైదరాబాద్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- 25న సిద్దిపేటలో జేపీ నడ్డా.. పాదయాత్ర, బహిరంగ సభ
- కార్యకర్తల్లో జోష్ నింపే లా వరుస కార్యక్రమాలు

మన మీ వార్త నవంబర్ 22 స్టేట్ కో ఆర్డినేటర్ హైదరాబాదు







తెలంగాణ రాజకీయం పై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించినట్లు వినిపిస్తున్నాయి రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ పోరాటాన్ని ఉధృతం చేయడం, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపడమే లక్ష్యంగా జాతీయ నేతల పర్యటనలకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు

ఇందులో భాగంగా మూడు రోజుల వ్యవధిలో ముగ్గురు కీలక నేతలు పర్యటించనున్నారు

నేడు బీజేపీ జాతీయ నాయకుడు నితిన్ నబీన్ కరీంనగర్ కు రానున్నారు. ఈ నెల 24 తేదీన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ కు రానున్నారు ఈ నెల 25 తేదిన కేంద్ర మంత్రి, బీజేపీ పూర్వ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాదయాత్ర, బహిరంగ సభలో పాల్గొంటారు

వరుసగా అగ్రనేతలు రాష్ట్రానికి వస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపేలా కార్యక్రమాలు రూపకల్పన చేశారు.

ధర్మారావుపేటలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం

ఖానాపురం, నవంబర్ 21(మల్లేష్ మీవార్త ప్రతినిధి) :



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ వల్లే శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

ఖానాపురం మండలం ధర్మారావుపేట గ్రామంలో గ్రామసర్పంచ్ మాద్రాజు వెంకన్న , పీఏసీఎస్ చైర్మన్ వల్లే శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అర్హులైన కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రేషన్ కార్డు కలిగి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత పొందిన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీల్, పంచాయతీ కార్యదర్శి అనిత ,వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఖానాపురం విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ



ఖానాపురం, నవంబర్ 22(మల్లేష్ మీ వార్త ప్రతినిధి) :

ఖమ్మం జిల్లాలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ 2026--27 పోటీల్లో ఖానాపురం మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. 8, 12 సంవత్సరాల వయస్సు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుని మండలానికి గుర్తింపు తీసుకొచ్చారు.

కరాటే మాస్టర్ సెన్సాయి పంతంగి నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. 8 సంవత్సరాల విభాగంలో బొల్ల ఆద్య గోల్డ్ మెడల్ సాధించింది. 12 సంవత్సరాల విభాగంలో ప్రథమ స్థానంలో ఊరేటి సాత్విక్, షేక్ వసీం అక్మల్, బొల్ల నికిత, వేముల సాత్విక్ నిలిచారు.

అదేవిధంగా ద్వితీయ స్థానంలో గుండ్లపెల్లి గౌతమ్ గౌడ్, ఎడ్ల సుమన్, తూనం అశ్వంత్, మాదికుంట్ల హర్ష బహుమతులు సాధించగా, తృతీయ స్థానంలో సాత్విక్ తదితరులు నిలిచి ప్రతిభ చాటారు. విద్యార్థులు సాధించిన విజయాల పట్ల వారి తల్లిదండ్రులు, ఖానాపురం మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

చిన్నారిని ఆశీర్వదించిన ప్రముఖులు



నవంబర్23,11,2026 పరకాల ప్రతినిధి మనమీ వార్త

హనంకొండ జిల్లా నడికూడ మండల కేంద్రానికి చెందిన వాంకే రాజు -- అరుణ దంపతుల కుమార్తె షణ్ముఖప్రియ పుష్పవతి వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

ఈ శుభకార్యానికి తెలంగాణ రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి షణ్ముఖప్రియను ఆశీర్వదించారు. ఆమె భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం తల్లిదండ్రులు వాంకే రాజు, అరుణ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అదేవిధంగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు మరియు హనుమకొండ జిల్లా అధ్యక్షులు హీంగే భాస్కర్, ఆరె సంక్షేమ సంఘం నడికూడ మండల అధ్యక్షులు లోకేటి నగేష్, ప్రభు, భాస్కర్, రాకేష్ తదితరులు వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అతిథులకు ఆత్మీయ స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. బంధుమిత్రులు, గ్రామ ప్రజల రాకతో వేడుక సందడిగా, ఆనందోత్సాహాల మధ్య సాగింది.

శ్రీభూగు లోని వెంకటేశ్వర స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎండ తగలకుండా

నవంబర్ 23,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



భూపాలపల్లి జయశంకర్ జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి శివారులో శ్రీ భూగు లోని వెంకటేశ్వర స్వామి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చలవ పందిరిలు వేయడం జరిగినది కావున భక్తులు ఎలాంటి ఇబ్బంది ఎండ తగలకుండా దర్శనం చేసుకుని ఆ స్వామివారి కరుణ కటాక్షాలు పొందాలని 23 తారీకు నుండి 27 వరకు జరుగు కార్తీక పౌర్ణమి బ్రహ్మోత్సవాలకు అందరూ వచ్చి ఆశీర్వాదం పొందవలసిందిగా కోరుకుంటున్నాము.

పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న ఒకటో వార్డు కౌన్సిలర్ దుబ్బాసి వెంకట స్వామి

నవంబర్ 23,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



హనంకొండ జిల్లా పరకాలలో మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పి హెచ్ సి),మరియు బూత్‌లలో చుక్కలు వేయించుకోని పిల్లల కోసం తదుపరి రోజులలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారు.

పిల్లలకు తేలికపాటి జ్వరం లేదా జలుబు ఉన్నా పోలియో చుక్కలు వేయించవచ్చు. అని అన్నారు..

పోలియో చుక్కలు పూర్తిగా సురక్షితమైనవి, ఉచితమైనవి.

పోలియో వైరస్ వల్ల కాళ్లు, చేతులు పడిపోయే ప్రమాదం ఉంటుంది; రెండు చుక్కలతో పిల్లలను దీని నుండి కాపాడవచ్చు వారు అన్నారు. ఇట్టి కార్యక్రమంలో వార్డు ప్రజలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హనుమకొండ ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త నవంబర్ 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్పీడీసీఎల్ గెస్ట్ హౌజ్ వద్ద ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

నేడు(సోమవారం) ప్రజావాణి కార్యక్రమం

- ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త నవంబర్ 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు, రెవెన్యూ డివిజనల్ స్థాయిలో హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రకటనలో సూచించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కురుమిళ్ళ శ్రీనివాస్ టేకుమట్ల మండల అధ్యక్షులు మేడిపెల్లి నరేష్



టేకుమట్ల నవంబర్ 22 (మన మీ వార్త)

టేకుమట్ల మండలం లోని అమ్మ గార్డెన్లో నాయి బ్రాహ్మణ సేవా సంఘం సంఘ సభ్యులు మురారి సది దంపతుల కూతురు ప్రత్యూష ప్రవీణ్ వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కురుమిళ్ళ శ్రీనివాస్ (కౌన్సిలర్), మండల అధ్యక్షులు మేడిపెల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, మండల కమిటీ సభ్యులు సోన్నాయి టెంకం మల్లయ్య, మురారి సాంబయ్య,మురారి కుమార్, మురారి రవి, మేడిపల్లి పెద్ద సారయ్య, చిన్న సారయ్య, ఓదేలు, ముల్కనూరి రాజు, దామెర సది, జిల్లా నాయకులు చేరాల రాజు, సుదర్శన్, గిద్దమారి రమేష్, కర్కపల్లి రవి, యూత్ నాయకులు మేడిపల్లి శివకోటి, ముత్యాల రాజు మురారి కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

వరంగల్, నవంబర్ 22 (మల్లేష్ మీవార్తప్రతినిధి) :





వరంగల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీ చేశారు.

వరంగల్ జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలను సందర్శించి, పథకం అమలు తీరును, అర్హులైన లబ్ధిదారుల వివరాల సేకరణ, నమోదు ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా శంభునిపేటలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్, రంగశాయిపేటలోని మహిళా స్వశక్తి భవనం, పర్వతగిరిలోని రైతు వేదిక, పర్వతగిరి గ్రామ పంచాయతీ కార్యాలయం, నెక్కొండ గ్రామ పంచాయతీ కార్యాలయం, నర్సంపేటలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, దుగ్గొండి మండలం గిర్నిబావి, గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

నమోదు కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరు, లబ్ధిదారుల నుంచి వివరాల సేకరణ, దరఖాస్తుల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. నమోదు కోసం వచ్చే అర్హులైన కుటుంబాలకు అవసరమైన సమాచారం అందించాలని, పథకానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ఎవరూ పథకం ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

నమోదు ప్రక్రియలో లబ్ధిదారుల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట డీఆర్డీవో నాగ పద్మజ, జడ్పీ సీఈవో వసంత,జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి పుష్పలత,సంబంధిత మండలాల తహసీల్దార్లు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

న్యూ హేమానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, పల్స్ పోలియో కార్యక్రమాలు

- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమం -- నాయకులు

హేమానగర్, నవంబర్ 22 (మన మీ వార్త):





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, అదే సమయంలో చిన్నారుల ఆరోగ్య భద్రత కోసం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు.న్యూ హేమానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పలువురు కాలనీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకే సమయంలో ప్రజల ఆర్థిక భద్రతకు జీవిత బీమా పథకాన్ని, చిన్నారుల ఆరోగ్య రక్షణకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని అమలు చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొమ్మక బాలయ్య, 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతరబోయిన కృపాసాగర్, న్యూ హేమానగర్ కాలనీ అధ్యక్షుడు కట్కం రాజేష్, మక్తోల్ కాలనీ అధ్యక్షుడు డి. ప్రసాద్ రెడ్డి, కార్యదర్శి మల్లేష్, యాదిరెడ్డి, హేమానగర్ కాలనీ మహిళా నాయకురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల సహకారంతో రెండు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.

తెలంగాణ ప్రింటింగ్ పరిశ్రమలను ఆదుకోండి

- 111 కోట్లకు పైగా పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి
- తెలంగాణ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 22 (మన మీ వార్త):





తెలంగాణ రాష్ట్రంలోని ప్రింటింగ్ పరిశ్రమలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణ సంస్థతో పాటు తెలుగు అకాడమీ నుంచి రావాల్సిన 111 కోట్లకు పైగా పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది.

గత 30 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రింటింగ్ సంస్థలు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను నిర్ణీత గడువులోగా ముద్రించి, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 60కి పైగా ప్రింటింగ్ సంస్థలు ప్రతి సంవత్సరం టెండర్లలో పాల్గొని ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా పుస్తకాలను ముద్రించి అందిస్తున్నాయని పేర్కొన్నారు.అయితే గత నాలుగు సంవత్సరాలుగా ప్రింటర్లకు రావాల్సిన బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో సంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణకు సంబంధించి గత మూడేళ్లుగా సుమారు 76 కోట్లు, తెలుగు అకాడమీకి సంబంధించి గత నాలుగేళ్లుగా 35 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు.

ఈ బకాయిల విడుదల కోసం పాఠ్యపుస్తక ముద్రణ సంస్థ, తెలుగు అకాడమీ డైరెక్టర్లు, సంబంధిత కమిషనర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీలను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. దీంతో మీడియా ద్వారా తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

ఈ ప్రింటింగ్ పరిశ్రమలపై ప్రత్యక్షంగా సుమారు 15 వేల మంది, పరోక్షంగా మరో 10 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. బకాయిలు విడుదల కాకపోవడంతో ఉద్యోగుల జీతాలు, పరిశ్రమల అద్దెలు, విద్యుత్ బిల్లులు, కాగితం, ఇతర ముడిసరుకుల సరఫరాదారులకు చెల్లింపులు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే అనేక ప్రింటింగ్ సంస్థలు శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రభుత్వానికి మూడు ప్రధాన విజ్ఞప్తులు చేసింది:ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 76 కోట్లను తక్షణమే విడుదల చేయాలి.తెలుగు అకాడమీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 35 కోట్లకు పైగా బకాయిలను వెంటనే చెల్లించాలి.భవిష్యత్తులో టెండర్లు నిర్వహించే ముందే అవసరమైన బడ్జెట్‌ను మంజూరు చేసి, ప్రింటింగ్ సంస్థలకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.ఎం ఎస్ ఎం ఈ రంగానికి చెందిన తెలంగాణ ప్రింటింగ్ పరిశ్రమలు సుమారు 25 వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తున్నాయని, వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఈ పరిశ్రమలను కాపాడేందుకు ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని తెలంగాణ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చేతులెత్తి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డి. వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ రెడ్డి, కోశాధికారి ఏ. ఉత్తమ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కె. స్వామి రెడ్డి, సంయుక్త కార్యదర్శి వి. అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు పి. శ్రీనివాస్ రెడ్డి, కె. తేజ, సభ్యులు ఎం.డి. అబ్దుల్ రఫూఫ్, కె. జలంధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నాచారం హెచ్.ఎం.టి. నగర్ డివిజన్‌లో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసిన బీజేపీ నాయకుడు పోతగాని గోపాల్ గౌడ్



- పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి -- పోతగాని గోపాల్ గౌడ్

నాచారం, నవంబర్ 22 (మన మీ వార్త)

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాచారం హెచ్.ఎం.టి. నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ పాల్గొని చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్య భద్రతకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు యోగేశ్వర్ రెడ్డి, చంద్రమౌళి, అన్వర్ భాయ్, వేణుగోపాల్, రమేష్, సురేందర్ స్వామి, మంజులవాణి, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్ అలేఖ్యతో పాటు స్థానిక నాయకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్

- అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలి

- నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని అధికారులకు ఆదేశం

మన మీ వార్త నవంబర్ 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్, నవంబర్ 22: వరంగల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీ చేశారు.

జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలను సందర్శించి, పథకం అమలు తీరును, అర్హులైన లబ్ధిదారుల వివరాల సేకరణ, నమోదు ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా శంభునిపేటలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్, రంగశాయిపేటలోని మహిళా స్వశక్తి భవనం, పర్వతగిరిలోని రైతు వేదిక, పర్వతగిరి గ్రామ పంచాయతీ కార్యాలయం, నెక్కొండ గ్రామ పంచాయతీ కార్యాలయం, నర్సంపేటలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, దుగ్గొండి మండలం గిర్నిబావి, గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామ పంచాయతీ



కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

నమోదు కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరు, లబ్ధిదారుల నుంచి వివరాల సేకరణ, దరఖాస్తుల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. నమోదు కోసం వచ్చే అర్హులైన కుటుంబాలకు అవసరమైన సమాచారం అందించాలని, పథకానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అర్హత కలిగిన



కుటుంబాలకు ఎవరూ పథకం ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

నమోదు ప్రక్రియలో లబ్ధిదారుల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట డీఆర్డీవో నాగ పద్మజ, జడ్పీ సీఈవో వసంత,జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి పుష్పలత,సంబంధిత మండలాల తహసీల్దార్లు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జవహర్ నగర్ లో గులాబీ జోష్ బీఆర్ఎస్ లో చేరిన 150 మంది కార్యకర్తలు

జవహర్ నగర్ , నవంబర్ 22: (వార్త ప్రతినిధి)

జవహర్ నగర్ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనులన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టినవేనని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేడ్చల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి విమర్శించారు.

ఆదివారం జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని కేఎన్ఆర్ నగర్ లో గల నోబుల్ హైస్కూల్ వద్ద నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, జవహర్ నగర్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులు, వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులతో పాటు చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా గత 25 ఏళ్లుగా స్థానిక ప్రజలు గాలి, నీటి కాలుష్యంతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, అప్పుడు జవహర్ నగర్ మరింత సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు వార్డుల్లోకి వస్తే ప్రజలు నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ లో భారీ చేరికలు:

ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు సుమారు 150 మంది ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

పార్టీలో చేరిన వారిలో పొలాస అశోక్, రాజేశ్వర్, రాము, మామిడిపల్లి పరమేష్ చారి, ప్రభాకర్, రాజు, హరీష్, అజీమ్, అరవింద్, సంజయ్, సంపత్, అనిల్, గణేష్, సంతోష్, వంశీ తదితరులు ఉన్నారు. మల్లారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన



కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్ చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కొండల ముదిరాజ్, మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్ గౌశ్రీశ్రీ శ్రీ నల్లు ఇంద్రసేనారెడ్డి గారితో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.

మన మీ నవంబర్ 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్ నగరంలో ఈరోజు పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు విచ్చేసిన త్రిపుర రాష్ట్ర గౌరవ గవర్నర్ శ్రీ నల్లు ఇంద్రసేనారెడ్డి గారికి భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ గారు, మాజీ శాసనసభ్యులు మార్తనేని ధర్మారావు స్వాగతం పలికారు.

-వరంగల్‌లోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి అమ్మవారి దేవస్థానాన్ని గవర్నర్ ఇంద్రసేనారెడ్డి గారితో కలిసి గంట రవికుమార్ గారు సందర్శించారు. ఆలయ అర్చకులు



వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



-దర్శనానంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ గారు గవర్నర్ ఇంద్రసేనారెడ్డి గారిని శాలువాతో సత్కరించి, ఆత్మీయ స్వాగతం పలికారు.

మేడిపల్లిలో కమ్మవారి వన భోజనాలు

హైదరాబాద్, నవంబర్ 22 (మన మీ వార్త):

వన భోజనాలతో సంస్కృతి సాంప్రదాయాలు, తోటి కులస్తుల మధ్య ఐక్యతా భావం పెంపొందుతుందని కమ్మవారి సేవాసమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మేడిపల్లిలో నిర్వహించిన వన భోజనాలలో రాజకీయ ప్రముఖులు, సామాజికవేత్తలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రావి జయధీర్ ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజికవేత్త గారు మాట్లాడుతూ కమ్మవారిలో పరస్పర అవగాహన, ఐక్యత భావం కారణంగా కులస్తులు సమాజానికి తమ వంతు సేవాభావాన్ని నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలలో కమ్మవారి ఉనికిని చాటి చెప్పే విధంగా జరుగుతున్న పలు కార్యక్రమాలు విద్యాభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి మరియు చురుకైన రాజకీయాలు చేయడం లో నా వంతు సహాయ సహకారాలు తప్పనిసరిగా అందిస్తానని సందర్భంగా ఆయన హామీ ఇస్తూ అదే విధంగా మనవారు సమాజ శ్రేయస్సు మానవాళి అభివృద్ధికి తమ వంతు కృషి చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తపరిచారు.

ఈ సందర్భంగా తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. వన భోజనాలలో భాగంగా మహిళలు చిన్నారులకు క్రీడా సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సత్యనారాయణ, కొత్త రామారావు ,



పొలవరపు శ్రీనివాస్ ప్రసాద్ గుత్తికొండ శ్రీనివాసరావు, రవి జయధీర్, తాళ్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం హనుమకొండ

- హనుమకొండ జిల్లాలో సబ్ నేషనల్ పల్స్ పోలియో

మన మీ వార్త నరంబర్ 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ఇమ్యునైజేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహణ
పోలియో చుక్కలు వేయించని పిల్లలకు రేపు, ఎల్లుండి ఇంటింటి సర్వే ద్వారా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలి:





జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య
హనుమకొండ జిల్లాలో సబ్ నేషనల్ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లను సందర్శించి కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా కమలాపూర్ పీహెచ్‌సీ మరియు దాని పరిధిలోని సబ్ సెంటర్లు, ఆత్మకూరు, శాయంపేట, నడికూడ, వంగర, ముల్కనూర్, గోపాల్‌పూర్, ఇనవోలు, కొండపర్తి, కడిపికొండ, దామెర, వేలేరు తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పోచమ్మకుంట యూఎఫ్‌డబ్ల్యూసీ, సోమిడి యూపీహెచ్‌సీ, బోడగుట్ట యూపీహెచ్‌సీ, కాజీపేట రైల్వే స్టేషన్, హనుమకొండ బస్‌స్టాండ్‌లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు.

అలాగే డాక్టర్ ప్రదీప్ రెడ్డి, డాక్టర్ రాజిత, డాక్టర్ శ్రీకృష్ణారావు, డాక్టర్ మురళి, డాక్టర్ జ్ఞానేశ్వర్ తదితర వైద్యాధికారులు కూడా తమ పరిధిలోని పోలియో బూత్‌లు, సబ్ సెంటర్లను సందర్శించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పర్యవేక్షణలో భాగంగా పోలియో వ్యాక్సిన్ వయల్ మానిటర్ (ఎఎవీ) స్థితి, వ్యాక్సిన్ నాణ్యతను కాపాడేందుకు కోల్డ్ చైన్ నిర్వహణ, ఐస్ ప్యాక్‌ల వినియోగం, వ్యాక్సిన్ నిల్వ విధానం, పోలియో చుక్కలు వేసుకున్న పిల్లలకు వేలిపై మార్కింగ్ చేయడం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిశీలించారు. వ్యాక్సిన్ నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా నిబంధనల ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఇదిలా ఉండగా, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా విచ్చేసిన శ్రీ ఫణీంద్ర జోషి న్యూ శాయంపేట, ఎల్కతుర్తి పీహెచ్‌సీ, గోపాల్‌పూర్, వంగర తదితర ప్రాంతాల్లోని పోలియో బూత్‌లను సందర్శించి కార్యక్రమ అమలును పరిశీలించారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించడమే లక్ష్యం
జిల్లాలో ఇప్పటివరకు పోలియో చుక్కలు వేసిన చిన్నారుల సంఖ్య, సాధించిన శాతం వివరాలు 83384. మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయగా, 98.5% శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, పోలియో బూత్‌లకు వచ్చి చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించేందుకు రేపు, ఎల్లుండి రెండు రోజుల పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. బూత్‌లకు రాలేకపోయిన, ఇంకా పోలియో చుక్కలు వేయించుకోని ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు.

జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య కోరారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి,హనుమకొండ జిల్లా.

నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ.3 వేల ఆర్థిక సాయం అందజేసిన బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి బుద్దుల భిక్షపతి



శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (22):

మండలంలోని దొంతి గ్రామపంచాయతీ కార్మికుడిగా గ్రామానికి ఎంతోకాలంగా సేవలందించిన బొడ్డు నాగరాజు మృతి చెందడం బాధాకరమని బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి బుద్దుల భిక్షపతి అన్నారు. నాగరాజు మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ,ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో తన వంతు సహాయంగా నాగరాజు భార్య కవితకు రూ.3,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

జనగామ సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు

- ప్రజలు తమ వినతులతో కలెక్టరేట్‌కు రావద్దు

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

మన మీ వార్త నవంబర్ 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలనాపరమైన కారణాల వల్ల ఈ సోమవారం (నవంబర్ 23)న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.



జూరాలలో జలవిద్యుత్తుకు ఆటంకం



హైదరాబాద్, : దిగువ జూరాల హైడల్ ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తికి గ్రహణం పట్టింది. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్లాంట్‌కు అనువైన వనరులున్నప్పటికీ కృష్ణానదిలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల వల్ల పూర్తిస్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి జరుగడం లేదు. ముఖ్యంగా నది గర్భంలోని బండరాళ్లు, రాతిమేటలు, వరదలతో కొట్టుకొచ్చిన ఇసుక, బురద విద్యుత్తు ఉత్పత్తికి అటంకాలు కలిగిస్తున్నాయి. 240 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌లో ప్రస్తుతం 212.8 మెగావాట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతున్నది. దిగువ జూరాల జలవిద్యుత్తు ప్రాజెక్టులో 40 మెగావాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన 6 యూనిట్లు ఉన్నాయి. 2016 అక్టోబర్ 1 నాటికే అన్ని యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ, 2017 అక్టోబర్ 21న నిర్వహించిన లోడ్ పరీక్షలో అసలు సమస్య బయటపడింది. ప్రాజెక్టు డిజైన్ ప్రకారం 279.65 మీటర్ల వద్ద ఉండాల్సిన టెయిల్ వాటర్ లెవెల్ వాస్తవంగా 281.30 మీటర్లకు చేరినట్టు గుర్తించారు. పవర్ హౌస్ నుంచి వెలువడే నీరు టెయిల్ రేస్ చానల్ ద్వారా కృష్ణానదిలో కలుస్తుంది. నీళ్లు కలిసే ప్రాంతంలో నదీ ప్రవాహ మార్గం ఇరుకుగా మారిపోయింది. 70-80 మీటర్ల వెడల్పు ఉండాల్సిన ఈ మార్గం రాతిగుట్టల కారణంగా 40 మీటర్లకు కుంచించుకుపోయింది. ఈ బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల టెయిల్ రేస్ చానల్‌లో నీటి మట్టం పెరిగి టర్బైన్ల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. టెయిల్ రేస్ చానల్ అడుగు భాగంలో రాతి దిబ్బలు, కృష్ణానది సంగమ ప్రాంతంలో శిలలు, దిగువన నది ఇరుకుగా మారడం, వరదల సమయంలో కొట్టుకొచ్చిన మట్టి, బండరాళ్లు పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నట్టు జెన్‌కో గుర్తించింది. నదీ ప్రవాహానికి అడ్డంకులు తొలగించలేకపోవడంతో అందుబాటులో ఉన్న యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

రూ.12.60 కోట్ల వ్యయంతో పనులు

టెయిల్ రేస్ చానల్‌లో పేరుకుపోయిన 2లక్షల క్యూబిక్ మీటర్ల రాతి దిబ్బలు, శిలలను తొలగించడం, కృష్ణానది సంగమ ప్రాంతం నుంచి పుషరఘాట్ వరకు నది గర్భం వెడల్పును 88 మీటర్ల వరకు పెంచడం, 2వేల క్యూబిక్ మీటర్ల మట్టి, బండరాళ్లను తొలగించడంపై జెన్‌కో దృష్టి సారించింది. 2025 సెప్టెంబర్ 23న జరిగిన జెన్‌కో 73వ బోర్డు సమావేశం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రూ.12.60 కోట్ల అదనపు మూలధన వ్యయంతో పనులు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ పనులు పూర్తయితే ఏటా 15 నుంచి 24 మిలియన్ యూనిట్ల అదనపు విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని జెన్‌కో అంచనా వేసింది. ఇందుకు వెచ్చించే మొత్తం 9.5 నెలల్లోనే రికవరీ అవుతుందని జెన్‌కో వర్గాలు చెప్తున్నాయి. ఈ పనులు చేపట్టేందుకు ఈఆర్సీ అనుమతి కోరారు.

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు



అచ్చంపేట/పదర, సీఎం రాకకోసం మద్దిమడులో పకడ్బం దీగా ఏర్పాట్లు చేయాలని ఎంపీ మల్లురవి అ న్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియో జకవర్గంలోని మద్దిమడుగు గ్రామానికి ఈ నెల 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేప థ్యంలో ఆదివారం ఎంపీ మల్లురవి, కలెక్టర్ హే మంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్యే వంశీకృష్ణలు పరిశీలించారు. మద్దిమడుగులో సంతుసేవాలా ల్ మహారాజ్ విగ్రహా ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలా లు, ప్రజల రాకపోకల మార్గాలను ఎంపీ మల్లు రవి పరిశీలించి అధికారులకు సూచనలు చేశా రు. సభకు వచ్చే గిరిజనులకు రవాణా, తాగు నీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడు తూ సంతు సేవాలాల్ మహారాజ్ విగ్రహా ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయ డం గిరిజన సమాజానికి గర్వకారణమన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనం తరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవసహాయం, డీఎస్పీ పి.శ్రీనివాసు లు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

నేడు చేనేతల రౌండ్ టేబుల్ సమావేశం



హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, చేనేత కళాకారులపై జరుగుతున్న వివక్షపై సోమవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు చేనేత దినోత్సవం వ్యవస్థాపకులు యర్రమాద వెంకన్న నేత ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్లలో చేనేత కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని, గత ప్రభుత్వ హయాంలో అమలైన థ్రిఫ్ట్ ఫండ్ సీమ్, యార్న్ సబ్సిడీ పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. చేనేత టెండర్ విధానాన్ని తీసుకువచ్చి చేనేత కార్మికుల ఉపాధిని పూర్తిగా దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా చేనేత కళాకారుల సంక్షేమం, అభివృద్ధి విషయంలో తీవ్ర వివక్ష చూపుతున్నదని మండిపడ్డారు. ఈ అంశాలపై సమగ్రంగా చర్చించి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నామని, అఖిలపక్ష నేతలు పెద్దఎత్తున హాజరై ఉద్యమ భాగస్వాములు కావాలని కోరారు.

టెలిఫోన్ కాలనీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- టెలిఫోన్ కాలనీ నూతన అధ్యక్షుడిగా మల్లెపల్లి రవీందర్ రెడ్డి,జనరల్ సెక్రటరీగా నారపోగు వినాయక్, ట్రెజరర్‌గా నిమ్మల బాలరెడ్డి ఏకగ్రీవ

బోడుప్పల్ సర్కిల్ నవంబర్ 22 (మన మీ వార్త)

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ ప్రజల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెపల్లి రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా నారపోగు వినాయక్ కుమార్, ట్రెజరర్‌గా నిమ్మల బాలరెడ్డి ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దానగళ్ల యాదగిరి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నూతన కమిటీ సభ్యులు కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో టెలిఫోన్ కాలనీ మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్‌తో పాటు కమిటీ సభ్యులు తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సహకారంతో కాలనీని మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.





నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- సుప్రజ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో జగదీష్ రెడ్డి, ఉత్తమ్ పద్మావతి రెడ్డి

మీ వార్త నవంబర్ 22 సూర్యాపేట జిల్లా ప్రతినిధి

సూర్యాపేట: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సుప్రజ హాస్పిటల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1971లో డాక్టర్ ఏపీ విఠల్ పేరుతో విఠల్ హాస్పిటల్‌ను ప్రారంభించి ఎంతోమందికి వైద్య సేవలు అందించారని గుర్తుచేశారు. అదే వైద్య సేవల వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆధునిక వైద్య సదుపాయాలతో సుప్రజ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఏ. రామయ్య, డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ రావు క్రీడా ప్రతిభ: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం

- డిప్యూటీ కలెక్టర్ స్థాయిలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఏకైక ఆటగాడిగా అరుదైన ఘనత

మీ వార్త నవంబర్ 22 సూర్యాపేట జిల్లా ప్రతినిధి

సూర్యాపేట: ఒకవైపు పరిపాలనాపరమైన విధుల్లో నిత్యం బిజీగా ఉంటూనే, మరోవైపు క్రీడలపై ఉన్న మక్కువతో ఫుట్‌బాల్ ఆటలో రాణిస్తూ సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ రావు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గోవా రాష్ట్రంలో జరుగుతున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ (2026-27) పోటీల్లో ఆయన తెలంగాణ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ నెల 17 నుండి 25వ తేదీ వరకు గోవా వేదికగా ఈ జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఫుట్‌బాల్ క్రీడలో మంచి ప్రావీణ్యం ఉన్న వేణుమాధవ రావు, ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ సివిల్ సర్వీసెస్ జట్టుకు స్ట్రైకర్ / మిడ్ ఫీల్డర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర జట్టులో డిప్యూటీ కలెక్టర్ స్థాయి హోదాలో ఎంపికై మైదానంలో ఆడుతున్న ఏకైక ఆటగాడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉద్యోగ బాధ్యతల ఒత్తిడిని అధిగమిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై, తెలంగాణ తరపున ఆడుతుండటం పట్ల పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది, క్రీడాకారులు మరియు సూర్యాపేట పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ వేదికపై ప్రతిభ చాటుతున్న ఆర్డీవో వేణుమాధవ రావుకు పలువురు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



హైదరాబాద్‌లో ముగిసిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్

హైదరాబాద్: రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రోడ్డు భద్రతపై కీలక చర్చలకు వేదికగా నిలిచిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ వార్షిక సమావేశాలు హైదరాబాద్‌లో ముగిశాయి. హైటెక్ సిటీలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి 3 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. రహదారుల నిర్మాణంలో నూతన ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ పరిజ్ఞానం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

19 సాంకేతిక సమావేశాలు

ఈ నాలుగు రోజుల కార్యక్రమంలో మొత్తం 19 సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. రహదారి భద్రత, నిర్మాణ సామగ్రి నాణ్యత, సుస్థిర మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల వినియోగం తదితర అంశాలపై చర్చించారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. దేశంలోని రహదారి నెట్‌వర్క్‌ను మరింత సురక్షితంగా, నాణ్యంగా, మన్నికగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పరిష్కారాలను వివరించారు.

400కు పైగా స్టాళ్లతో టెక్నాలజీ ఎక్స్‌పో

సమావేశాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంకేతిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 400కు పైగా స్టాళ్లలో రహదారులు, వంతెనల నిర్మాణానికి సంబంధించిన ఆధునిక పరికరాలు, నూతన ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. తక్కువ నిర్వహణ వ్యయంతో ఎక్కువకాలం మన్నికగా ఉండే రహదారుల నిర్మాణం, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే నిర్మాణ సామగ్రి, ప్రమాదాల నివారణకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను అందుబాటులో ఉంచారు.



భద్రత, నాణ్యతకు పెద్దపీట

దేశంలో పెరుగుతున్న రహదారి నెట్‌వర్క్‌కు అనుగుణంగా నిర్మాణ ప్రమాణాలను మెరుగుపరచాల్సిన అవసరంపై ప్రతినిధులు దృష్టి సారించారు. రోడ్ల నిర్మాణంలో ఆధునిక ఇంజినీరింగ్ విధానాలు, నాణ్యమైన నిర్మాణ సామగ్రి వినియోగం, వంతెనల నిర్వహణ, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. సాంకేతికతను సమర్థంగా వినియోగించడం ద్వారా నిర్మాణ వ్యయాన్ని నియంత్రించడంతోపాటు రహదారుల మన్నికను పెంచవచ్చని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు

సదస్సుకు హాజరైన ప్రతినిధులకు తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర సంప్రదాయ కళలు, సంస్కృతి, ఆహారపు అలవాట్లను ప్రతిబింబించే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అతిథులకు తెలంగాణ రుచులను పరిచయం చేస్తూ సుమారు 90 రకాల వంటకాలను వడ్డించారు. దీంతో సాంకేతిక చర్చలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రోడ్ల శాఖ ప్రాజెక్టులపై పుస్తకావిష్కరణ

తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ చేపడుతున్న ముఖ్యమైన ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, భవిష్యత్తు ప్రణాళికలను ఇందులో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు.

ప్రారంభోత్సవానికి ప్రముఖుల హాజరు

ఐఆర్‌సీ 85వ వార్షిక సమావేశాల ప్రారంభోత్సవానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. రహదారి రంగంలో సాంకేతిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు

దాదాపు 50 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్న ప్రపంచ బ్యాంకు నివేదికపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయాన్ని అంగీకరించేందుకు ప్రతిపక్షాలు సంకోచిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే కొందరు ఈ వాస్తవాన్ని గుర్తించేందుకు వెనుకాడుతున్నారని వ్యాఖ్యానించారు.

ప్రపంచ బ్యాంకు నివేదికపై హర్షం

గుజరాత్‌లోని 182 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దీపావళి అనంతరం నిర్వహించిన 'స్నేహ మిలన్' కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. వెయ్యేళ్ల బానిసత్వం కారణంగా దేశం పేదరికంలో కూరుకుపోయిందని, స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటం గొప్ప విజయమని పేర్కొన్నారు.



సంక్షేమ పథకాలతో మార్పు

పేదల కోసం బ్యాంకు ఖాతాలు తెరవడం, వంటగ్యాస్ కనెక్షన్లు అందించడం, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ, విద్యుత్ కనెక్షన్లు కల్పించడం వంటి చర్యలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని మోదీ వివరించారు. ప్రారంభంలో ఈ పథకాలపై కొందరు ప్రశ్నలు లేవనెత్తినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదన్నారు.

చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనాలు

ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరవేయడమే లక్ష్యంగా పనిచేశామని తెలిపారు. సామాజిక న్యాయం అంటే ఏమిటో ఆచరణలో చూపించామని పేర్కొన్నారు. పేదరికం నుంచి ప్రజలు బయటపడటం వారి జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అన్నారు.

కార్యకర్తలకు కృతజ్ఞతలు

తాను గుజరాత్‌తో పాటు దేశానికి సేవ చేసే స్థాయికి చేరుకోవడానికి బీజేపీ కార్యకర్తల కృషి, సహకారమే కారణమని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే తరాలు దేశ స్వర్ణయుగాన్ని చూస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఘట్లోడియా నియోజకవర్గం నుంచి ప్రధాని ప్రసంగాన్ని వర్చువల్‌గా వీక్షించారు.

భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక చర్చలేవీ జరగలేదు

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఎలాంటి ద్వైపాక్షిక చర్చలు జరగలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దిల్లీలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) మూడు రోజుల సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్‌లో పాక్ ప్రతినిధులతో కేవలం సాధారణ సంభాషణలు మాత్రమే జరిగాయని వెల్లడించింది. పాకిస్థాన్ తరఫున హాజరైన ఆ దేశ పర్యావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌తో అధికారిక చర్చలు జరపలేదని తేల్చిచెప్పింది.

ఇంద్రప్రస్థ కమ్యూనిక్ విడుదల

సదస్సు ముగింపు సందర్భంగా సభ్య దేశాల సూచనలతో రూపొందించిన 'ఇంద్రప్రస్థ కమ్యూనిక్'ను కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ విడుదల చేశారు. సాంస్కృతిక వారసత్వాన్ని అక్రమ రవాణా, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించుకోవాలని ఈ ప్రకటన పిలుపునిచ్చింది. ప్రతి నాగరికతను సమాన గౌరవంతో చూడాలని, వాస్తుశిల్పం, సంగీతం, వంటకాలు, వస్త్రధారణలోని ఉమ్మడి వారసత్వాన్ని గుర్తించాలని సూచించింది.

వారసత్వ పరిరక్షణకు సాంకేతికత

సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)ను నిర్మాణాత్మకంగా వినియోగించుకోవాలని కమ్యూనిక్ పేర్కొంది. యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం సభ్య దేశాలు ఉమ్మడిగా నామినేషన్లు సమర్పించాలని తీర్మానించింది. దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించడంలో సంస్కృతి



వారధిగా నిలుస్తుందని అభిప్రాయపడింది.

నాలుగు అంశాలపై సాంకేతిక సమావేశాలు

పురానా ఖిలాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ఫోరమ్‌లో పలు కీలక అంశాలపై చర్చలు జరిగాయని వివేక్ అగర్వాల్ తెలిపారు. తాళపత్ర గ్రంథాలు, భాషా వారసత్వం, పురావస్తు శాస్త్రం, సాంస్కృతిక వ్యక్తీకరణలు, బౌద్ధ మఠాల మార్గాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారని వివరించారు. సభ్య దేశాల ప్రతినిధులు కూడా పలు సూచనలు అందించారని పేర్కొన్నారు.

ప్రపంచ శాంతికి సంస్కృతి వారధి

ఈ వేదిక ద్వారా భాగస్వామ్య దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం అవుతుందని అగర్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి, సామరస్యాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరచడంలో ఫోరం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. భారతదేశం ప్రతిపాదించిన 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) భావన ఎస్‌సీఓ సభ్య దేశాలు, సంభాషణ భాగస్వాములో ప్రతిధ్వనిస్తోందని పేర్కొన్నారు. ఈ నెల 20న ప్రారంభమైన ఎస్‌సీఓ సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్ ఆదివారంతో ముగిసింది.

చైనా సరిహద్దు గ్రామాల్లో పెరిగిన జనాభా

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సరిహద్దుకు సమీపంలోని 40 గ్రామాల్లో జనాభా పెరిగిందని, అక్కడి నుంచి వలసలు తగ్గుముఖం పట్టాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆయా గ్రామాల్లో ఉపాధి, ఆరోగ్య, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో ప్రజలు తిరిగి వస్తున్నారని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ పాలనలో అరుణాచల్‌ప్రదేశ్ అభివృద్ధిని విస్మరించారని, రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి భారీగా నిధులు పెంచిందని వివరించారు. అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనలో భాగంగా ఇటానగర్‌లో నిర్వహించిన సహకార సదస్సులో ఆయన మాట్లాడారు. 2004-2014 మధ్య యూపీఏ ప్రభుత్వం అరుణాచల్‌ప్రదేశ్‌కు రూ.33,530 కోట్లు కేటాయించగా, 2014-2024 మధ్య ఎన్డీయే ప్రభుత్వం రూ.1,64,664 కోట్ల ఆర్థిక సహాయం అందించిందని అమిత్ షా వెల్లడించారు. రాష్ట్రానికి వచ్చే పన్నుల వాటా నాలుగు రెట్లు, గ్రాంట్లు 18 రెట్లు పెరిగాయని తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్ బడ్జెట్ రూ.12 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్లకు పెరగడం రాష్ట్రంలో అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సరిహద్దు గ్రామాలను దేశంలోని చివరి గ్రామాలుగా కాకుండా తొలి గ్రామాలుగా చూడాలన్న ప్రధాని మోదీ ఆలోచనతో అక్కడి అభివృద్ధికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రాథమిక సదుపాయాలతో పాటు జీవనోపాధి అవకాశాలు



కల్పించడమే లక్ష్యమని చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్' వలసలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తోందని, దాదాపు 40 గ్రామాల్లో ప్రజలు తిరిగి నివసించడం ప్రారంభించడంతో జనాభా పెరిగిందని వివరించారు.

ఈశాన్యంలో మెరుగైన రవాణా సౌకర్యాలు

గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో ఈశాన్య ప్రాంతంలో రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని అమిత్ షా అన్నారు. ఈశాన్య రాష్ట్రాల రాజధానులకు రోడ్డు, రైలు, విమాన మార్గాల ద్వారా అనుసంధానాన్ని మెరుగుపరిచామని తెలిపారు. విద్య, ఆర్థికాభివృద్ధి, యువతకు ఉపాధి, పారిశ్రామిక రంగాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ ప్రాంతంలోని సహజ వనరులు, పర్యాటక సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగించుకుంటే దేశాభివృద్ధికి మరింత దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సహకార సంఘాల ఉత్పత్తులకు ప్రోత్సాహం

అరుణాచల్‌ప్రదేశ్‌లోని సహకార సంఘాల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని హోంమంత్రిత్వ శాఖ ఐటీబీపీ, సైన్యాన్ని ఆదేశించిందని అమిత్ షా తెలిపారు. దీనివల్ల సరిహద్దు గ్రామాల ప్రజలకు, సాయుధ బలగాలకు మధ్య సంబంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. మహిళలు సహకార సంఘాల ద్వారా పాల ఉత్పత్తులు, గుడ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, పిండి వంటి వాటిని సరఫరా చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఉపాధి, విద్య, వైద్య సదుపాయాలు, కుటుంబాల సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు.

స్వయం సమృద్ధి సాధించే మార్గాలు అన్వేషించాలి: కిరణ్ రిజిజు

అరుణాచల్‌ప్రదేశ్ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పిలుపునిచ్చారు. ప్రజల గుర్తింపు, భూ హక్కులు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే పెట్టుబడులు, సాంకేతికత, ఆధునిక సౌకర్యాలను ఆకర్షించే విధానాలపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన స్వభావం, పరిమిత వనరులు, భూ యాజమాన్యంపై ఉన్న ఆంక్షల కారణంగా రాష్ట్రం ప్రత్యేక సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. 2014 నుంచి ప్రధాని మోదీ నాయకత్వంలో అరుణాచల్‌ప్రదేశ్ అభివృద్ధి వేగవంతమైందని పేర్కొన్నారు.

అగ్నివీరులకు పెళ్లికి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో సేవలందిస్తున్న అగ్నివీరులకు కేంద్రం కీలక వెసులుబాటు కల్పించినట్లు వార్తలు వెలువడ్డాయి. నాలుగేళ్ల ప్రాథమిక సర్వీసు పూర్తి చేసుకుని మరో రెండేళ్లపాటు విధుల్లో కొనసాగాలని నిర్ణయించుకునే అగ్నివీరులు వివాహం చేసుకునేందుకు అనుమతి లభించనుంది. అయితే ఇందుకు కొన్ని నిబంధనలు వర్తించనున్నాయి. రెండో విడత సర్వీసులో చేరే సమయంలో అవివాహితులుగా ఉండటంతో పాటు, సుమారు నాలుగు వారాలపాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణను విజయవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వివాహానికి అనుమతి లభిస్తుందని రక్షణ వర్గాలను ఉటంకిస్తూ కథనాలు వెల్లడించాయి.

నాలుగేళ్ల సర్వీసులో పెళ్లికి నో

2022 జూన్ 14న కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం నిబంధనల ప్రకారం అగ్నివీరులు నియామక సమయంలో అవివాహితులై ఉండాలి. నాలుగేళ్ల ప్రాథమిక సర్వీసు పూర్తయ్యే వరకు వివాహం చేసుకోవడానికి అనుమతి లేదు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే సర్వీసు నుంచి తొలగించే అవకాశం ఉంటుంది. తాజాగా రెండేళ్ల అదనపు సర్వీసును ఎంచుకునే వారికి మాత్రం కొన్ని షరతులతో వివాహానికి అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. అగ్నిపథ్ పథకం ఎప్పటికప్పుడు సమీక్షకు లోబడి ఉంటుందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి గతంలో పేర్కొన్నారు. అగ్నిపథ్ పథకంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల కీలక మార్పులు చేసింది. నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అగ్నివీరుల్లో ప్రతిభ ఆధారంగా 25 శాతం మందిని సాధారణ సాయుధ దళాల్లోకి తీసుకునే నిబంధన కొనసాగనుంది. మిగిలిన 75 శాతం మందికి మరో రెండేళ్లపాటు సేవలందించే అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ అదనపు సర్వీసు పూర్తయిన తర్వాత సాయుధ దళాల్లో శాశ్వతంగా చేరేందుకు ఆసక్తి చూపే వారికి మరో అవకాశం కల్పించనున్నారు. అయితే వారి అంగీకారంతో పాటు నిర్దేశిత ఎంపిక ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయాన్ని నవంబర్ 4న సీడీఎస్ జనరల్ రాజా సుబ్రమణి వెల్లడించారు.

నిబంధనల సడలింపుతో ఊరట

అగ్నివీరులు 17.5 నుంచి 21 ఏళ్ల మధ్య వయసులో సైన్యంలో చేరుతున్నారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తయ్యే సమయానికి వారి వయసు 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉంటుంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత, కుటుంబ జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో వివాహ నిబంధనల్లో సడలింపు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. రెండో విడత సర్వీసులో చేరే సమయంలోనూ అవివాహితులుగా ఉండాలన్న నిబంధన కొనసాగనుంది. నాలుగు వారాల శిక్షణ అనంతరం వివాహం చేసుకోవచ్చని తాజా కథనాలు పేర్కొంటున్నాయి.

పథకంలో మరిన్ని మార్పులకు అవకాశం

అగ్నిపథ్ పథకాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని కేంద్రం గతంలోనే ప్రకటించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పనితీరును పరిశీలించిన అనంతరం సర్వీసు పొడిగింపుపై నిర్ణయం తీసుకుంది. అదనపు రెండేళ్ల సర్వీసులో మెరుగైన వేతనం, సేవా నిధి ప్రయోజనాలు, సీనియారిటీకి సంబంధించిన వెసులుబాట్లు కూడా కల్పించనున్నారు. భవిష్యత్తులో సైనిక నియామకాలు, సర్వీసు నిబంధనల్లో మరిన్ని మార్పులు వచ్చే అవకాశముందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!



దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో నవంబర్ నెలాఖరులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే దీనిపై తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతానికి ఎలాంటి తుపాను హెచ్చరికలు జారీ చేయలేదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధిపతి పి.ఎల్.ఎన్. మూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 మధ్య కాలంలో దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చు. ఇది క్రమంగా బలపడి అల్పపీడనంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఇది మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా లేదా అనే అంశంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ఒకవేళ బలపడినా కూడా, అది శ్రీలంక లేదా తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ వైపు వస్తుందని చెప్పలేమని ఆయన వివరించారు. దీని తీవ్రత, ప్రయాణించే మార్గానికి సంబంధించి ఐఎండీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని తెలిపారు. సాధారణంగా ఉపరితల ఆవర్తనం అనేది వాతావరణ వ్యవస్థలలో అత్యంత ప్రాథమిక దశ మాత్రమేనని, ఇలా ఏర్పడే ప్రతి ఆవర్తనం తుపానుగా మారదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నవంబర్ 27 తర్వాత అల్పపీడనం ఏర్పడిన అనంతరమే దీని తదుపరి కదలికలపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది.

తూర్పు గాలుల ప్రభావంతో వర్షాలు:

మరోవైపు, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో కురుస్తున్న వర్షాలకు, నెలాఖరులో రాబోయే ఆవర్తనానికి ఎలాంటి సంబంధం లేదని ఐఎండీ స్పష్టం చేసింది. తూర్పు గాలుల (ఈస్టర్లీ వేవ్స్) ప్రభావంతో వచ్చే కొద్దిరోజులు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో నవంబర్ 22 నుంచి 28 వరకు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా నవంబర్ 23 నుంచి 26 మధ్య ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. తమిళనాడు, పుదుచ్చేరిలలో నవంబర్ 23 నుంచి 27 వరకు భారీ వర్షాలు, కేరళలో నవంబర్ 24 నుంచి 26 వరకు అక్కడక్కడా భారీ వర్షాలు పడవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో రాగల రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ తీరానికి ప్రస్తుతం ఎలాంటి తుపాను ముప్పు లేదా రెడ్ అలర్ట్ లేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని అధికారులు సూచించారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు విడుదల చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రేమకు అడ్డుగా ద్వేష భావజాలం!

న్యూఢిల్లీ: భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు సరైన అవగాహన లేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతీయ సంప్రదాయాలను లోతుగా అర్థం చేసుకుంటున్న కొద్దీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలంలోని లోపాలు స్పష్టమవుతున్నాయని వ్యాఖ్యానించారు. ఆదివారం తన ఎక్స్ ఖాతాలో ఎలిఫెంటా గుహల్లోని 12వ శతాబ్దానికి చెందిన శివపార్వతుల శిల్పం ఫొటోను షేర్ చేశారు. 'సత్యం శివం సుందరం' అంటూ తన అభిప్రాయాలను వెల్లడించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల మనసుల్లో భయం, కోపం, ద్వేషం పేరుకుపోయాయని, అవే ప్రేమను అనుభవించకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయని రాహుల్ ఆరోపించారు. కులతత్వం, పురుషాధిక్య భావజాలం నుంచి వారు బయటపడాలని పేర్కొన్నారు. నిజమైన హిందువుగా వారిని ఆ భావజాలం నుంచి బయటకు తీసుకురావడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.

శివపార్వతుల శిల్పంతో కౌంటర్

తన తల్లి సోనియాగాంధీ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇటీవల రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. భోజనం చేసే సమయంలో తన తండ్రి రాజీవ్‌గాంధీ ఒడిలో తల్లి సోనియా కూర్చునేవారని, స్నేహితుల ఇళ్లకు వెళ్లినప్పుడు వారి తల్లిదండ్రులు అలా కూర్చోకపోవడం చూసి ఆశ్చర్యపోయేవాడినని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ సహా పలువురు నేతలు రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో శివపార్వతుల శిల్పం ఫొటోను షేర్ చేస్తూ రాహుల్ తనదైన శైలిలో విమర్శలకు సమాధానమిచ్చారు.

మోదీ వ్యాఖ్యలపైనా విమర్శలు

ఇదిలా ఉండగా, వేతనాల పెంపు, ఉద్యోగాల కల్పన అంశాలపై కార్పొరేట్ సంస్థల అధినేతలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపైనా రాహుల్ గాంధీ స్పందించారు. ఫిక్కీ శతాబ్ది సదస్సులో ప్రధాని చేసిన ప్రసంగంపై విమర్శలు గుప్పించారు. పన్ను రాయితీలు కల్పిస్తున్నప్పటికీ పరిశ్రమలు ఉద్యోగుల వేతనాలను పెంచడం లేదని, తగినన్ని ఉపాధి అవకాశాలు సృష్టించడం లేదని ప్రధాని చెప్పడం ప్రభుత్వ ఆర్థిక విధానాల వైఫల్యాన్ని అంగీకరించడమేనని వ్యాఖ్యానించారు.

గుత్తాధిపత్యాలకు ప్రభుత్వమే కారణం: రాహుల్

ప్రభుత్వ విధానాలు గుత్తాధిపత్యాలను ప్రోత్సహిస్తున్నాయని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) బలహీనపరుస్తున్నాయని రాహుల్ ఆరోపించారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, గనులు, అడవులు, విద్యుత్, రహదారులు వంటి కీలక రంగాల్లో కొందరి ఆధిపత్యం పెరిగిందని విమర్శించారు. ఇన్ని రంగాలపై పట్టు సాధించిన సంస్థలు ఎన్ని ఉద్యోగాలు సృష్టించాయని ప్రశ్నించారు. ప్రధాని వ్యాఖ్యలు ప్రభుత్వ విధానాల వైఫల్యాలను స్వయంగా వెల్లడిస్తున్నాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

అయ్యప్ప భక్తులకు అలర్ట్

బుకింగ్ డేట్ మిస్ అయితే ఇక దర్శనం లేనట్లే!

శబరిమల అయ్యప్ప దర్శన వర్చువల్ క్యూ బుకింగ్ విధానంలో కఠిన నిబంధనలు రానున్నాయి. వాటిని అమలు చేసేందుకు పోలీసులు, ట్రావెన్?కోర్ దేవస్థానం బోర్డు సిద్ధమవుతున్నాయి. బుక్? చేసుకున్న తేదీన దర్శనానికి వెళ్లని భక్తులు, తమ టికెట్?ను రద్దు చేసుకోవడం లేదా రీషెడ్యూల్ చేయకపోతే మండల సీజన్‌లో మరోసారి బుకింగ్ చేసుకునే అవకాశం కోల్పోవచ్చు. అయితే అనివార్య కారణాలతో దర్శనానికి వెళ్లలేని వారు ముందుగానే తమ బుకింగ్‌ను రద్దు చేసుకోవడానికి లేదా మరో తేదీకి మార్చుకోవడానికి అవకాశం కల్పించనున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు భక్తుల గుర్తింపు పత్రాలను సేకరించి, పెద్ద మొత్తంలో టికెట్లు బుక్ చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ తర్వాత వాటిని భక్తులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిని నియంత్రించేందుకు ఆధార్ ఆధారిత ఓటీపీ ధ్రువీకరణ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. టికెట్ బుక్ చేసుకునే సమయంలో భక్తుల ఆధార్? నంబర్ నమోదు చేయడంతో పాటు, దానికి అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రతి భక్తుడికి ప్రత్యేక క్యూఆర్ కోడ్ కేటాయించి, పంపా లేదా నిలక్కల్ వద్ద తనిఖీ చేసే విధానాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. శబరిమలలో రోజుకు 80వేల మంది భక్తులకు దర్శనం చేసుకునేందుకు అనుమతి ఉన్నప్పటికీ, కొన్ని రోజుల్లో అనుమతించిన సంఖ్యలో సగం మంది మాత్రమే ఆలయానికి చేరుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు.

గోదావరి పుష్కరాల లోగో రూపకల్పనకు రూ.లక్ష బహుమతి



గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తెలంగాణ దేవాదాయ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పుష్కరాల విశిష్టత, గోదావరి నదీ ప్రాశస్త్యం, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా లోగో, ట్యాగ్‌లైన్ రూపొందించేందుకు పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి కలిగిన డిజైనర్లు, కళాకారులు, విద్యార్థులు, సృజనాత్మకత కలిగిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. తెలుగు, ఇంగ్లీష్ లేదా రెండు భాషల్లోనూ లోగో, ట్యాగ్‌లైన్ రూపొందించి సమర్పించేందుకు అవకాశం కల్పించింది.

విజేతలకు భారీ నగదు బహుమతులు

పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులు అందించనున్నారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు ప్రకటించారు. వీరితోపాటు ఉత్తమంగా ఎంపికైన టాప్ 100 మందికి ధ్రువపత్రాలు అందజేయనున్నారు. లోగోలో గోదావరి నది ప్రాముఖ్యత, పుష్కరాల ఆధ్యాత్మిక నేపథ్యం, సంప్రదాయాలు, భక్తి భావం స్పష్టంగా ప్రతిబింబించాలని సూచించారు. పోటీలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం దేవాదాయ శాఖ వెబ్‌సైట్ endowments.ts.nic.inను సందర్శించాలని అధికారులు సూచించారు.

8 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం

2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సుమారు 8 కోట్ల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని దేవాదాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నద్ధతపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కరాల నిర్వహణకు చేపట్టాల్సిన పనులు, భక్తుల రాకపోకలు, స్నానఘట్టాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

జూన్ 26 నుంచి జులై 7 వరకు

2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు మొత్తం 12 రోజులపాటు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు దేవాదాయ శాఖ ఇప్పటికే కార్యాచరణ రూపొందిస్తోంది. పుష్కరాల నిర్వహణకు సంబంధించి మొత్తం 67 ప్రాంతాలను గుర్తించినట్లు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. భక్తుల రాకపోకలు, ఆయా ప్రాంతాల ప్రాధాన్యత, పుష్కర స్నానాలకు వచ్చే వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుని మూడు కేటగిరీలుగా విభజించినట్లు వివరించారు.

సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రణాళిక

పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రత వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. స్నానఘట్టాల వద్ద రద్దీ నియంత్రణ, పార్కింగ్, రహదారుల అభివృద్ధి, భక్తుల కోసం విశ్రాంతి ప్రాంతాల ఏర్పాటు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ సంజయ్ జాజూ ఆదేశించారు. ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

ఘాట్ల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు

తెలంగాణలో గోదావరి నది ప్రవహించే జిల్లాలు, ప్రాంతాల్లో పుష్కర ఘాట్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం జిల్లాలతోపాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో స్నానఘట్టాలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించింది. పుష్కరాలకు ముందుగానే పనులన్నీ పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

సమన్వయంతో ఏర్పాట్లు

పుష్కరాల నిర్వహణలో దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఆయా శాఖల మధ్య సమన్వయం, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కోటి ఓట్లు.. 90 సీట్లు గెలుస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేలు, నాయకులను బలవంతంగా బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి తీసుకెళ్లారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ లేకుండా చేస్తానని అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. ఆ పరిస్థితుల్లో తాను పీసీసీ అధ్యక్షుడిగా డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి, 90 రోజుల్లో దేశంలోనే అత్యధికంగా 48 లక్షల మందిని కాంగ్రెస్ సభ్యులుగా చేర్పించినట్లు తెలిపారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే అవకాశాలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాల్లో విజయం సాధించిందని, మిత్రపక్షమైన సీపీఐ ఒక స్థానాన్ని గెలుచుకుందని సీఎం గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు 90 లక్షలకు పైగా ఓట్లు రావడంలో కార్యకర్తల కృషి కీలకమని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో జెండా మోసిన నాయకులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చామని చెప్పారు. అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వాకిటి శ్రీహరి, మక్కాన్‌సింగ్, రాజ్ ఠాకూర్ వంటి నాయకులకు పార్టీ అవకాశాలు కల్పించిందని వివరించారు. వారిలో కొందరికి మంత్రి పదవులు కూడా దక్కాయని తెలిపారు.

నాడు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఎమ్మెల్యేగా పోటీ చేయాలని కోరితే, తాను గాంధీభవన్‌లో సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తానని చెప్పారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. అనంతరం ఆయన ఎమ్మెల్సీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా పార్టీ కోసం నిజాయతీగా పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు.

పార్టీ లైన్‌లో ఉంటే పదవి దానంతట అదే వస్తుంది

కాంగ్రెస్ నాయకుల ప్రవర్తన, మాటతీరును పార్టీ నిశితంగా గమనిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నాయకులు



బయట ఏం మాట్లాడుతున్నారు, అంతర్గతంగా ఎలా వ్యవహరిస్తున్నారనే విషయాలపై పార్టీకి సమాచారం ఉందని చెప్పారు. రాజకీయాల్లో నాయకుల పనితీరుకు ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలే కొలమానమని పేర్కొన్నారు. ఎవరు ఎంత కష్టపడ్డారో ఎన్నికల సమయంలో అంచనా వేస్తామని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తామని, పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించిన వారినీ విస్మరించబోమని హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయని భరోసా ఇచ్చారు.

నిరాశలో ఉన్న నేతలకు గుర్తింపు

ఎన్టీఆర్ హయాం, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలను కొనసాగిస్తూనే, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని సీఎం తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. మంచి పనులను బహిరంగంగా ప్రచారం చేయాలని, లోపాలను అంతర్గతంగా తెలియజేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన పలువురికి అడగకుండానే ఎమ్మెల్సీ పదవులు కల్పించామని చెప్పారు. ఎమ్మెల్యే టికెట్లు దక్కని వారికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని తెలిపారు. నిరాశలో ఉన్న నాయకులకు భవిష్యత్తులో తప్పకుండా గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాహుల్‌గాంధీపై విశ్వాసంతో కాంగ్రెస్‌లో చేరారని, ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్ అసెంబ్లీ టికెట్ విషయంలో సురేశ్ షెట్కర్ తనకు కేటాయించిన బీఫామ్‌ను సంజీవరెడ్డి కోసం వదులుకున్నారని గుర్తుచేశారు. అనంతరం సురేశ్ షెట్కర్‌కు పార్లమెంట్ సభ్యుడిగా అవకాశం కల్పించామని తెలిపారు.

కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి

తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి పదవి గౌరవప్రదమైనదని సీఎం అన్నారు. గతంలో పలువురు ప్రముఖ నాయకులు ఈ బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తిరిగి అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది

బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారంతో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకు వస్తానని గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, అక్కడి రాజకీయ పరిస్థితులపై ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఎం వ్యంగ్యంగా మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ సభ్యుల వ్యవహారశైలిపై విమర్శలు చేశారు. గత సమావేశాల్లో వారే తమ నిరసనను ఆ విధంగా వ్యక్తం చేశారని వ్యాఖ్యానించారు.

అర్హతలున్నా.. అభద్రతే!

హైదరాబాద్: రాష్ట్ర ఉన్నత విద్యారంగానికి వెన్నెముకగా నిలుస్తున్న తమకు ఉద్యోగ భద్రత కరువైందని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 నుంచి 25 ఏళ్లుగా రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా బోధన, పరిశోధన, పరిపాలన బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ తమను కాంట్రాక్ట్ విధానంలోనే కొనసాగించడం అన్యాయమంటున్నారు. ఇప్పటికీ తమకు సరైన గుర్తింపు, పనికి తగ్గ వేతనాలు అందడం లేదని 12 వర్సిటీల్లోని 2 వేలకు పైగా కాంట్రాక్ట్ అధ్యాపకులు వాపోతున్నారు. తక్షణమే తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బోధన, పరిశోధనలో కీలక పాత్ర

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లంతా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్దేశించిన విద్యార్హతలు కలిగి ఉన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు బోధనతోపాటు పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనలో మార్గదర్శకత్వం వహిస్తున్నారు. పలువురు పేటెంట్లు సాధించడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రఖ్యాత జర్నళ్లలో పరిశోధనా పత్రాలు ప్రచురించారు. వాటికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించింది. పరీక్షల నిర్వహణ, ఇన్విజిలేషన్, ప్రశ్నపత్రాల రూపకల్పన, మోడరేషన్, థియరీ పేపర్ల మూల్యాంకనం, ప్రాక్టికల్ పరీక్షలు వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ప్లేస్‌మెంట్, మూల్యాంకనాలు, పబ్లిక్ రిలేషన్స్ విభాగాల్లోనూ సేవలందిస్తున్నారు. యూజీ, పీజీ



పాఠ్యపుస్తకాల రూపకల్పన, రచనలో భాగస్వాములవుతున్నారు. యూజీసీ, ఐసీఎస్ఎస్ఆర్, డీబీటీ, డీఎస్టీ వంటి సంస్థల పరిశోధనా ప్రాజెక్టుల్లో కో--ప్రాజెక్ట్ డైరెక్టర్లు, కో--ఇన్వెస్టిగేటర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌ఛార్జి హెచ్ఓడీలుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యులుగా, డిపార్ట్‌మెంట్ కమిటీలు, పరిశోధనా కమిటీల్లోనూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాకే కొత్త నియామకాలు..

ఇంతటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తమకు కనీస వేతనాలు కూడా అందడం లేదని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే రకమైన పనిని చేస్తున్నప్పుడు సమాన వేతనం చెల్లించాలన్న సుప్రీంకోర్టు సూత్రాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ ఇటీవల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను విశ్వవిద్యాలయ వ్యవస్థలో విలీనం చేయాలని సిఫారసు చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. పంజాబ్, అస్సాం, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను విశ్వవిద్యాలయాల్లో విలీనం చేసి రెగ్యులర్ ఫ్యాకల్టీ హోదా కల్పించిన అంశాన్ని ఉదాహరణగా చూపిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అదే తరహాలో నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. రెగ్యులరైజేషన్ లేదా విలీన ప్రక్రియకు మరింత సమయం పట్టే పక్షంలో తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించి, 2016 నుంచి అమల్లో ఉన్న 7వ యూజీసీ పే కమిషన్ వేతనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కరించిన తర్వాతే కొత్త అధ్యాపక నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏపీ ప్రాజెక్టులకు బీఆర్ఎస్ ముద్ర!



-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. తెలంగాణలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం కేసీఆర్ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగలేదని విమర్శించారు.

గాంధీభవన్‌లో కాంగ్రెస్ కీలక భేటీ

ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), సలహా కమిటీ సంయుక్త సమావేశం జరిగింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల నూతన ఇన్‌చార్జి బీఎం సందీప్‌తో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కార్యదర్శులు సచిన్ సావంత్, జెట్టి కుసుమకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు.

కరువు పరిస్థితులపై ఆందోళన

రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. విద్యుత్ డిమాండ్ ఎంతగా ఉన్నప్పటికీ సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆహార ధాన్యాల కొరత లేదని, అయితే ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని రానున్న ఎనిమిది నెలలపాటు ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని చెప్పారు. కరువు పరిస్థితులను అధిగమించేందుకు కేంద్రాన్ని రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం కోరుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేస్తుంటే, బీజేపీ ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. యాంత్రికంగా ఓటర్ల పేర్లను తొలగించడం వల్ల కొందరు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఎన్టీఆర్, వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన కొన్ని కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నామని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన పార్టీ ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు స్వాగతం పలికిన రేవంత్‌రెడ్డి, గతంలో ఇన్‌చార్జిగా పనిచేసిన మీనాక్షి నటరాజన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఇందిరమ్మ సూక్తులు' పుస్తకావిష్కరణ

మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రచురించిన 'ఇందిరమ్మ సూక్తులు' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు. ఆంగ్లంలో ఉన్న ఇందిరాగాంధీ సూక్తులను డాక్టర్ పొన్నం రవిచంద్ర, డాక్టర్ మామిడి హరికృష్ణ, శ్రీలక్ష్మి తెలుగులోకి అనువదించారు. ఈ కార్యక్రమంలో బీఎం సందీప్, మహేశ్‌కుమార్‌గౌడ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా!

-మొదటిపేజీ తరువాయి

ఆధ్వర్యంలో నిర్వహించిన జన చైతన్య సభలో కేటీఆర్ ప్రసంగించారు.



420 హామీలిచ్చి మోసం చేశారు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చారని, కనీసం లక్షాధికారులుగానైనా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు తమ సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ముఖ్యమంత్రి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు.

వరంగల్ అభివృద్ధిపై ప్రశ్నలు

వరంగల్ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద ఆస్పత్రుల్లో ఒకటిగా నిర్మించిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించలేదని విమర్శించారు. వరంగల్‌లో యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తమ హయాంలో నాలుగు ఐటీ కంపెనీలను తీసుకొచ్చామని, కనీసం వెయ్యి ఉద్యోగాల కల్పనకు ప్రయత్నించామని తెలిపారు.

ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి, కమీషన్ల వ్యవహారాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన సాగడం లేదని, పర్సంటేజీల పాలన కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి కుటుంబాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ నిర్ణయాలపై పలు ఆరోపణలు చేశారు.

ఫ్యూచర్ సిటీపై విమర్శలు

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఫ్యూచర్ సిటీలో భవిష్యత్తు లేదని, వరంగలే భవిష్యత్తు నగరమని వ్యాఖ్యానించారు. వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు.

మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని కేటీఆర్ అన్నారు. మరో 500 రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, 2028లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి పనులపై ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు.

కేంద్ర పార్టీలపై విమర్శలు

రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకత్వం జాతీయ పార్టీలకు గులాంగిరీ చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. అమిత్‌షా, రాహుల్‌గాంధీలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రయోజనాల కంటే జాతీయ నాయకత్వాల ఆదేశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండూ నిలిచిపోయాయని విమర్శించారు.



రష్మిక మందన్న 'మైసా' రిలీజ్ వాయిదా.. నవంబర్ 27న రావడం లేదని మేకర్స్ ప్రకటన!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మైసా' విడుదల వాయిదా పడింది. ఈ చిత్రాన్ని తొలుత నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. అయితే, తాజాగా ఈ విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'మైసా' ప్రపంచాన్ని ఎటువంటి రాజీ లేకుండా అత్యుత్తమ నాణ్యతతో, సినిమాకు తగిన గొప్ప అనుభూతిని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ దార్శనికతతో నవంబర్ 27న జరగాల్సిన థియేట్రికల్ రిలీజ్‌ను వాయిదా వేస్తున్నామని, కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. కొత్త రిలీజ్ డేట్ వచ్చేలోపు అభిమానులు ఆ ఉత్సాహాన్ని అలాగే కొనసాగిస్తూ, చిత్రంలోని జోష్ నింపే 'ఓసే రాములమ్మ' పాటను ఆస్వాదించాలని మేకర్స్ కోరారు. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ను అన్‌ఫార్ములా ఫిల్మ్స్, టీ-సిరీస్ సౌత్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వాయిదా వార్తతో అభిమానులు కొంత నిరాశకు గురైనప్పటికీ, నాణ్యత విషయంలో రాజీ పడకుండా సినిమాను తీసుకువస్తున్నారన్న అంశం పట్ల ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు.

శ్రద్ధా కపూర్ ట్రెడిషనల్ లుక్.. పసుపు చీరలో మెరిసిపోయిన బాలీవుడ్ బ్యూటీ



సైకిల్ పక్కన దిశా పటానీ అందాల పోజులు.. లేటెస్ట్ ఫొటోలు వైరల్



వెండితెరపై నాగదుర్గ వెలుగు

జానపద పాటలు, కూచిపూడి నాట్యంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష గుర్తింపు పొందిన నల్లగొండకు చెందిన నాగదుర్గ వెండితెరపై వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'ఇడుపు కాయితం' సినిమా షూటింగ్ ఇటీవల పూర్తయి విడుదలకు సిద్ధం కాగా.. తాజాగా 'శనార్తి' చిత్రంలో నటించేందుకు అంగీకరించారు. జానపద గీతాల ద్వారా తన అభినయం, హావభావాలతో ప్రేక్షకులను అలరించిన నాగదుర్గ ఇప్పుడు పూర్తిస్థాయి సినీ నటిగా మారుతున్నారు. ఇప్పటికే ఆమె నటించిన ఇడుపు కాయితం చిత్రీకరణ పనులు పూర్తయి, విడుదల దశకు చేరుకున్నాయి. మరోవైపు కొత్త ప్రాజెక్ట్ శనార్తి సినిమాకు నాగదుర్గ పచ్చజెండా ఊపారు. కథాంశం, తన పాత్రకు ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో ఈ చిత్రంపై ఆమె ఎంతో ఆశలు పెట్టుకున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న శనార్తి సినిమాతో ఆమె కెరీర్‌లో మరో కీలక ఘట్టం మొదలవనుంది.

కళాసేవలోనూ ముందుంటూ...

ఒకవైపు జానపద పాటలు, యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, మరోవైపు సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నా.. నాగదుర్గ తన మూలాలను, కళాసేవను మర్చిపోలేదు. పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూచిపూడిలో పీజీ పూర్తి చేసిన ఆమె, భవిష్యత్‌లో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. నల్లగొండలో నాగదుర్గ నాట్యాలయం పేరుతో కూచిపూడి శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తూ, విద్యార్థులకు నాట్యం నేర్పిస్తూ వారాంతాల్లో స్వస్థలానికి వచ్చి కళాభివృద్ధికి పాటుపడుతున్నారు.

కూచిపూడి నుంచి మొదలైన పయనం

ఉమ్మడి నల్లగొండ జిల్లా అడ్డగూడూరు నాగదుర్గ స్వస్థలం. ఉద్యోగరీత్యా తల్లిదండ్రులు నల్లగొండలో స్థిరపడ్డారు. నాగదుర్గ పదో తరగతి వరకు నల్లగొండలో చదువుకుని, హైదరాబాద్‌లో ఇంటర్, బీఎస్సీ పూర్తి చేశారు. చిన్ననాటి నుంచే నృత్యంపై ఉన్న మక్కువతో కూచిపూడిలో శిక్షణ తీసుకున్నారు. 2021లో 'తిన్నాతీరం పడతలే' జానపద పాటతో నటనలోకి అడుగుపెట్టిన ఆమె. నాలుగేళ్ల వ్యవధిలో సుమారు 300 జానపద పాటల్లో నటించి యూట్యూబ్‌లో కోట్లాది వ్యూస్, 100 మిలియన్ మార్క్‌ను అందుకున్నారు. శాస్త్రీయ నృత్యం నుంచి జానపదంలోకి వచ్చి, ఇప్పుడు వరుస సినిమాలతో వెండితెరపై తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు.



printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512